తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
29 జూలై 2026

## కర్ణాటక మాజీ మంత్రి బోసురాజుతో.. మంత్రి వాకిటి శ్రీహరి భేటీ

- కొల్పూరు - కుర్తికొండ బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చ



**కృష్ణ, జూలై 28 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి బోసురాజుతో రాయచూరులో మంగళవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యా రు. ఈ సందర్భంగా తెలంగాణ.,కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృ ద్ధికి కీలకమైన కొల్పూరు --కుర్తికొండ బ్రిడ్జ్ కమ్ బ్యారే జీల నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు.కృష్ణా నది పై ప్రతిపాదిత బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల నిర్మాణం ద్వారా రెండు రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెగుపడటంతో పాటు సాగు, తాగునీటి అవసరాలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరువురు నేతలు ఆకాంక్షించారు. సాధ్యమై నంత తొందరగా ఈ ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లాల ని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో మండల అద్యక్షుడు మాలిపాటేల్ విజయప్ప గౌడ, మాగనూల్ ఆనంద్ గౌడ, యువజన అద్యక్షుడు షేక్ సర్ఫరాజ్, గురుజాల్ రవి పాటేల్ గౌడ, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమ సంతోష, గుడేబల్లూర్, శివప్ప గౌడ, ముస్క కృష్ణమూర్తి, గురుజాల్ సంతోష పాటేల్, తదితరులు పాల్గొన్నారు.

## నిలువురాళ్ల పార్కుకు మంత్రి శ్రీహరి శ్రీకారం



**కృష్ణ, జూలై 28 (జనంసాక్షి):** చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజక వర్గంలోని కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లా డుతూ...చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ...ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని,యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కొరకు కొన్ని సూచనలు ఇచ్చారని వాటిని పాటించి గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. ఇదివరకే మంత్రి వాకిటి శ్రీహరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇందుకు తగిన వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 400 పాఠశాలల హెడ్మాస్టర్లకు శిక్షణ ఇచ్చి దాదాపు 60 వేల మంది విద్యార్థులు మూడుమాల్ నిలువు రాళ్ళను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 20 మంది టూరిస్ట్ గైడ్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు తగిన మ్యాప్ తయారు చేయాలన్నారు. ప్రజలు భాగస్వాములై ఇక్కడి విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేలా అవగాహనకల్పించుకోవాలన్నారు. శాస్త్ర విజ్ఞానం రాకముందే 3 వేల సంవత్సరాల క్రితం నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని ఆనాడే రూపొందించారని తెలిపారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విశిష్టతను చాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎడి వి విజయ్ లక్ష్మి, ఆర్కలజీ, తాసిల్దార్ శ్రీనివాస్, గ్రామ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 28(జనంసాక్షి):** పరిశ్రమల ఏర్పాటుకు టి ఎస్ ఐ పాస్ అనుమతులను జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు.నారాయణ పేట జిల్లా పరి శ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మంగళ వారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మంది రంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన జిల్లా పారిశ్రా మిక ప్రోత్సాహక కమిటీ, టీఎస్-ఐపాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలోటీఎస్-ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులు,వివిధ శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న అనుమతులు,పరిశ్రమల స్థాపనకు అవస రమైన అనుమతుల జారీ ప్రక్రియపై సమీక్ష జరిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలె క్టర్ మాట్లాడుతూ టీఎస్- ఐపాస్ చట్టం ప్రకారం పరిశ్రమలకు సంబంధించిన దరఖాస్తులను అన్ని శాఖ లు నిర్దేశిత గడువులోపు పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా అనుమ తులు మంజూరు చేయా లని ఆదేశించారు.పరిశ్రమల స్థాపనకు అవసర మైన సేవలను సకాలంలో అందించి,పెట్టుబడిదారులకు పారదర్శకమైన, వేగవం తమైన సేవలు అందించా లని సూచించారు.ఈ సమా వేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామ లింగేశ్వర్ గౌడ్ తో పాటు అన్ని లైన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం

- కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 28 (జనంసాక్షి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి, బ్లాక్ స్పాట్లలో తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం లో కలెక్టర్ గత సమావేశ నిర్ణయాల అమలును సమీక్షించి, ప్రమాదాలు అధి కంగా జరుగుతున్న ప్రాంతాలపై అధి కారులతో చర్చించారు. రోడ్లపై ఆక్ర మణలు తొలగించడం, గుంతలు మరమ్మతు చేయడం, బారికేడ్లు, హైమాస్ట్ లైట్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేయాలని ఆదే శించారు.

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా ట్రామా కేర్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, అంబు లెన్స్ సేవల సిద్ధతను సమీక్షించి వైద్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.





రోడ్డు భద్రత ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయం తో పనిచేసి అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్, రవాణా శాఖ అధికారులు, డీఎస్పీలు, ఆర్టీసీ ప్రతినిధులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.



## ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం.. పల్లెల్లో జోరుగా మద్యం విక్రయాలు

మిగతా 12లో..

- వైన్ షాపుల తలపిస్తున్న- కిరాణా షాపులు...
- ఫిర్యాదులు వస్తున్నా పట్టింపు కరువు
- ఛిద్రమవుతున్న సామాన్య కుటుంబాలు
- లంచాల ముసుగులో సంబంధిత అధికారులు

**కోహిర్, జులై 28(జనంసాక్షి):** పచ్చని పల్లెల్లో జోరుగా మద్యం అమ్మకాలు మూడు పుల్లులు, ఆరు కాయలు, అన్నట్లుగా చ్చలవిడిగా సాగిపోతుంది. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని దేశాల్లో సైతం అన్ని వేళల్లోనూ మద్యం అందుబాటులో ఉంటుంది ఎనీ టైమ్ మందు ఎక్కడపడితే అక్కడ లభిస్తుంది. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు నిబంధనలకు తరేస్తూ దర్జాగా వ్యాపారాన్ని సాగి స్తున్నారు. ఇంత రుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టిపట్టనట్లు ీవహరించడం విమర్శలకు తావిస్తోంది. సంగారెడ్డి జిల్లా కోహిర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కిరాణాలు సైతం వైన్ షాపులుగా తలపిస్తున్నాయి. ప్రతి నెల ఎక్సైజ్ అధికారులకు,లంచాలు ఇస్తూ.. యథేచ్ఛగా 24 గంటలు అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు సమయం మించిపోయిన అర్ధరాత్రి వరకు ట్రింగ్లు పెట్టి విచ్చలవిడిగా వ్యాపారాలు జరుపుతున్నా ట్టించుకునే నాధులే లేరని ప్రజలు విమర్శస్తున్నారు. ఎక్సైజ్ మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా.. మద్యం వ్యాపారులు

**వార్తనే ధ్యేయంగా... మద్యం వ్యాపారులు, మారుమూల**

గ్రామాలలో సైతం ధనార్జనే ధ్యేయంగా వ్యవహ రిస్తూ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలలో మద్యం వ్యాపారాలు, సాగిస్తున్నారు. చిన్నపాటి కిరాణా షాపుల్లో సైతం అన్ని బ్రాండ్లు అందు బాటులో ఉండడంతో అధిక ధరలకు అమ్మకాలు వేళాపాల లేకుండా 24గంటలూ విక్రయాలు జరుపుతున్నారు. క్వార్టర్పై రూ.30 నుంచి 50 అద నంగా వసూలు చేస్తున్నారు. ఇలా గ్రామాలలో ఇష్టానుసారంగా వ్యాపారాలు సాగుతున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యారు.

**పేరుకే కిరాణం.. అమ్మేది మద్యమే..**

అనేకమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వ హిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తు న్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిద్దులు పెట్టుకొని మరీ విక్రయిస్తున్నారు. మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. ఊరూరా బెల్టుషాపులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు.

# రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

- ఎల్‌నీనో నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ కె.హైమావతి





**నంగునూర్, జులై 28 (జనంసాక్షి):**
ఎల్‌నీనో ప్రభావం వలన ఆగస్టు చివరి వారం నుండి సెప్టెంబర్ అక్టోబర్ మాసాల్లో వర్షాలు కురవవని, భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, వరి సాగు చేయకుండా ఆరుతడి పంటల సాగు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం హైదరాబాద్ నుండి రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ లో పంట మార్పిడి, ఎల్ నీ నో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, వర్షాపాతం, భూ గర్భ జలాల స్థితి మరియు ఆయిల్‌ఫామ్ సాగు గూర్చి రాష్ట్రంలోని అన్ని రైతువేదిలలోని రైతులు మరియు అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ రైతునేస్తం 100 ఎపిసోడ్‌లి కార్యక్రమంలో జిల్లాలోని నంగునూరు మండలం నర్మేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ రైతు నేస్తం కార్యక్రమం అనంతరం రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాకాలంలో జూన్, జూలై లో అనుకున్నంత వర్షాలు పడలేదు. ఇప్పుడు చిన్న చితక వర్షాలు పడుతున్నాయి కానీ ఆగస్టు ఆఖరు వారం నుండి సెప్టెంబర్‌లో లోటు వర్షపాతం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు సూచించారు. జిల్లాలో రైతులు సంప్రదాయంగా వరి ఒక్కటే పండిస్తున్నారని తగ్గించి నీరు తక్కువ తీసుకోవే పంటలు వేసుకోవాలి. ఒక ఎకరం వరి పండించే నీటితో 5 ఎకరాల ఆరుతడి పంటలు పండించవచ్చు. మాకు నీరు లభ్యత ఉందని వరి పండించే రైతులు ఈ నెలలోనే రోజురోజుకి భూగర్భజలాలు పడిపోతున్నాయని, వరి ఏపుగా పెరిగే ఆగస్టు చివర, సెప్టెంబర్ మాసాలలో ఎక్కువ మొత్తంలో భూగర్భజలాలు తగ్గుతాయని, వరి ఎండిపోయే ప్రమాదం ఉందని దయచేసి వరి జోలికి పోకుండా ఆరుతడి పంటల సాగు చేయాలని తెలిపారు. రైతులు ఆదాయం తగ్గకుండా, దానికి అనుగుణయన పంట పండించాలి, కందులు, పప్పు దినుసులు, రాగులు, సజ్జలు, కొర్రల, మిల్లెట్ వైపు ఎక్కువ దృష్టి సారించాలని, భూమిని కాలిగా ఉంచకుండా ఆముదం సైతం పండించుకోవచ్చని సూచించారు. నర్మేట గ్రామంలోనే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఉంది కాబట్టి పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగుచేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, ఇందులో అంతర పంటలు వేసుకోవచ్చునీ సూచించారు. ఈ క్లిష్టమైన సమయంలో అడపాదడపా కురిసిన వర్షాలకు నీటిని ఒడిసి పట్టడం కోసం వీబీ- జీరామ్ పథకంలో ఫామ్ ఫౌండ్, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ రీఛార్జ్ స్టాక్చర్, బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్‌లు గ్రామాల్లో ప్రతి రైతు వేసుకుని నీటిని ఇంకే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులు అందరూ ఈ విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి గ్రామాల్లో సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంను పెద్ద ఎత్తున చేపట్టి ప్రతి ఒక్క నీటి చుక్కను ఒడిసి పట్టడానికి మీ వంతు సహాయ, సహకారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఏఓ మల్లయ్య, నంగునూరు ఏఎంసి ఛైర్మన్ యాదగిరి, పిఏసిఎస్ చైర్మన్‌లు కోల రమేష్ గౌడ్, ఎల్లంకి మైపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ శనిగరం స్వాతి బాబు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సంతోష్ రెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైసంపల్లిలో బాలవికాస వాటర్ ప్లాంట్ పున: ప్రారంభం

- సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి





**నంగునూరు, జులై 28 (జనంసాక్షి):**
నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో గత 5 సంవత్సరాలుగా మూతబడిన బాలవికాస వాటర్ ప్లాంట్‌ను గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి ,మాజీ మంత్రి సిద్దిపేట హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లగా బాలవికాస సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో మంగళవారం రోజు పునః ప్రారంభం చేయడం. జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే ఇబ్బందులు తప్పాయని , ఈ సందర్భంగా హరీష్ రావు కి, బాలవికాస సంస్థకు ధన్యవాదాలు తెలుపుతూ . ఎమ్మెల్యే హరీష్ రావు ప్రేరణతో వాటర్ ప్లాంట్ సభ్యత్వం పొందినవారికి స్వంత ఖర్చులతో ఉచితంగా వాటర్ క్యాన్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస వాటర్‌ప్లాంట్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, గ్రామ పెద్దలు జాప రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ పాలక వర్గం, గ్రామస్తులు, బాలవికాస ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ స్తంబాల కూల్చివేత

- విధ్వంసకర ఘటన



**శివ్వంపేట, జూలై 28 (జనంసాక్షి):**
వ్యవసాయ పొలంలోని బోరుకు విద్యుత్ సరఫరా కోసం పాతిన కరెంట్ స్తంభాలను ధ్వంసం చేసిన విధ్వంసకరమైన ఘటన శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితుడు అంబిగారి నర్సింలు తెలిపిన కథనం ప్రకారం దొంతి గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో ఉన్న వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం ఇదే గ్రామానికి చెందిన చుక్క మల్లేష్ పొలంలో నుండి మూడు కరెంట్ స్తంభాలను పాతడం జరిగిందన్నారు. విద్యుత్ స్తంబాలు పాతిన విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన చుక్కా మల్లేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాపొలంలో నుండి ఎట్లా స్తంబాలు పాతినవురా.. ఇదేమన్నా నీ జాగీరా.. నీ అయ్యా జాగీరా అంటూ దుర్భాషాలాడుతూ జేసీబీ సహాయంతో కరెంట్ స్తంభాలను పూర్తిగా విరగొట్టించినాడని దళిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ తెలిపారు. అయితే నర్సింలు బోరుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరి నారు పూర్తిగా ఎండిపోయిందని రైతు విలపించాడు. విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకువాలని ఆయన సంబంధిత అధికారులను కోరాడు.

## ఎల్లంపల్లిలో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ మమతా నవీన్



**టేక్మాల్,జులై 28 (జనంసాక్షి):**
టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ మమతా నవీన్ ప్రారంభించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహ సహకారంతో సిసి రోడ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఈ సీసీ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషన్, నిమ్మ రమేష్,రాజేష్ గౌడ్, కార్యదర్శి సత్యం, వార్డ్ సభ్యులు యాదయ్య, నారాయణ, సాయి బాబా, పండరి తదితరులు పాల్గొన్నారు.

## కౌడిపల్లిలో మొదలైన ఎల్లమ్మ జాతర



**కౌడిపల్లి, జూలై 28, (జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి లో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు మైలలు తీసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. ఎల్లమ్మ జాతర కార్యక్రమంలో గ్రామస్తులంతా భాగస్వాములై జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం పెద్దలు దుర్గా గౌడ్, ఉప సర్పంచ్ శ్వేత మల్లికార్జున్ గౌడ్, కృష్ణ గౌడ్ తోపాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### ఫీజురీయింబర్స్ మెంట్

## బకాయిలు వెంటనే చెల్లించాలి..

- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్
- సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్



**పెద్ద శంకరంపేట, జూలై 28 (జనంసాక్షి):**
తెలంగాణ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్. బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ లు పేర్కొన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బిజె వైఎం తెలంగాణ రాష్ట్రశాఖ పిలుపుమేరకు ఫీజుల బకాయి బిజెపి లడాయి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. విద్యార్థులకు బకాయి ఉన్న 15వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బిజెవైఎం కన్వీనర్ సాయి పటేల్ కో కన్వీనర్ బుగుడాల కృష్ణ, మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, నాయకులు ప్రభు గౌడ్ ప్రవీణ్ సాయిరాం ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విట్టలేశ్వర స్వామి రథోత్సవం...



**పెద్ద శంకరంపేట, జూలై 28 (జనంసాక్షి):**
ఆషాడ మాస ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలో మంగళవారం శ్రీ రుక్మిణి విఠలేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి ప్రత్యేకంగా మంగళహారతులు ఇచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన రతంపై రుక్మిణి విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి విఠలేశ్వర స్వామి దేవాలయం నుండి పాత గ్రామపంచాయతీ కొత్త బస్టాండ్.. అంబేద్కర్ చౌరస్తా.. పాత బస్టాండ్. పట్టణ పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. భక్తులు భజనలు కీర్తనలు పాడుతూ ప్రధాని లాగుతూ కన్నుల పండుగగా రథోత్సవం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా చిన్నారులు చేసిన భజనలు కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విఠలేశ్వర స్వామి ఆలయ భక్తులు. అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులు హాస్టల్లో చదువుతారు

- స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్



**చిన్నశంకరంపేట, జులై 28(జనంసాక్షి):**
పేద విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు ఇతర సామాగ్రిని హాస్టల్ వార్డెన్ తులసిరాం ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ అందించారు. మంగళవారం చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. పేద విద్యార్థులు హాస్టల్లో ఉంటూ ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ తులసి రామ్, బిక్షపతి పాల్గొన్నారు.

## కుమారుని జ్ఞాపకార్థం చిన్నారులకు కుర్చీలు అందజేత



**చిన్నశంకరంపేట, జులై 28 (జనంసాక్షి):**
మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండలం సూరారం గ్రామంలో అంగన్వాడి పిల్లలకు కుర్చీలు బాహకరించడం జరిగింది. సూరారం గ్రామానికి చెందిన బుజ్జన్న నిహాల్ ఐదు సంవత్సరాల వయసు గల అబ్బాయి గత నాలుగు నెలల కింద హార్ట్ ఎటాక్‌తో మరణించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుక నాగరాజు గ్రామపంచాయతీ కార్యదర్శి నాంపల్లి గ్రామ జిపిఓలు రాజు మహేష్ పంచాయతీ పాలక వర్గ సభ్యులు జ్యోతి మహిపాల్ అంగన్వాడి టీచర్లు స్వప్న అనిత రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



నిజాంపేట్, జూలై 28 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం చెల్మెడ గ్రామంలోని ఆయిల్ ఫామ్ నర్సరీని హార్టికల్చర్ అధికారి, అగ్రికల్చర్ అధికారి ఎంపీడీవోతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాలు ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2500 ఎకరాల ఆయిల్‌ఫామ్ సాగుకోసం పకడ్బందీగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న ఆయిల్‌ఫామ్ నర్సరీలో మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా దేశాలనుంచి విత్తనాలు తెప్పించి, మొక్కలుగా ఏదిగాక రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఎంపీడీవో రాజిరెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

• డీఈవోకు టిపిటిఎఫ్ నాయకుల వినతి



సంగారెడ్డి, జూలై 28 (జనంసాక్షి): ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంగళవారం జిల్లా విద్యాధికారి రోహిణికి టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, మునిపల్లి మండల అధ్యక్షుడు నీలి లక్ష్మణ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సెన్సస్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్‌లు మంజూరు చేస్తూ వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పై అంశాలపై డీఈఓ రోహిణి సానుకూలంగా స్పందిస్తూ, ఈఎల్ ప్రొసీడింగ్స్ జారీతో పాటు వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లను కూడా త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, మునిపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ మల్లికార్జున్‌పల్లి ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్ ఈ నెల 31న జరగనున్న ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరు కావాలని డీఈఓను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మునిపల్లి మండలంలోని పలు విద్యా సంబంధిత సమస్యలను కూడా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా విద్యాధికారి సానుకూలంగా స్పందించడంతో టిపిటిఎఫ్ నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపు

• ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్



సంగారెడ్డి, జూలై 28 (జనంసాక్షి): సంగారెడ్డి పట్టణంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా మంగళవారం నిర్వహించారు. సంగారెడ్డి ఐబీ నుంచి ప్రారంభమైన ఈ బోనాల ఊరేగింపు అస్తబల్ వరకు సంప్రదాయబద్ధంగా కొనసాగింది. డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలు, పోతరాజుల విన్యాసాలు, మహిళల బోనాలతో ఊరేగింపు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ , మాజీ సిడీసీ చైర్మన్ కు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి పాల్గొని శ్రీ ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులను పలకరించారు.

వారితో కలిసి చిందులు వేస్తూ సందడి చేశారు ఈ సందర్భంగా నిర్వాహకులు చింత సాయినాథ్ , కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి లను శాలువాలతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరికీ అమ్మవారి కటాక్షం లభించాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాసిని శ్రీకాంత్, రవి, సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లకుదారం మాణిక్ ప్రభు పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కార్యనిర్వాహక అధ్యక్షులు సాయినాథ్, యూత్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, అధ్యక్షులు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మురళి, స్వాగత్ ప్రభు, పెంటయ్య, హనుమంతు, సాయి కిరణ్, అక్షయ్, అఖిల్, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సుకుమార్, సత్యనారాయణ, మహిళ కమిటీ సభ్యులు సుధామణి, పద్మావతి, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

## అధ్వాన స్థితిలో ప్రభుత్వ బాలికల కళాశాల పరిస్థితి





మెదక్ టౌన్, జూలై 28 (జనంసాక్షి): మెదక్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల అధ్వాన స్థితిలో ఉందని మెదక్ జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులు ఉన్న కళాశాలలకు హాస్టల్స్ కు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని మండిపడ్డారు. మంగళవారం రోజున బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ బాలుర జూనియర్ కళాశాలకు వెళ్ళి అక్కడ ఉన్న పారిశుద్ధ్యంపై కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు రావడంతో పాటు పాములు కూడా రావడం జరుగుతుంది వర్షం పడితే కళాశాలకు వెళ్లే దారే లేదు విద్యార్థులని వారి సమస్యలు పట్టించుకునే పరిస్థితి మెదక్ పట్టణంలో లేదు స్థానిక ఎమ్మెల్యే కూడా సమస్య ఉందని తెల్వడం లేదా ఇప్పటికైనా అధికారులు ఎమ్మెల్యే స్పందించి కళాశాల వద్ద సమస్యను పరిష్కరించాలని బీజేవైయం డిమాండ్ చేస్తుంది. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ బాలికల కళాశాల పరిస్థితి మాత్రం మారలేదు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా దానికి బాధ్యత స్థాని ఎమ్మెల్యే అధికారులు బాధ్యత వహించాలి అని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం చెయ్యకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సాయి బాబ్లు భాస్కర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టాను చీల్చి సాగు భూమిగా మారుస్తున్న వైనం

• అధికారులారా భూ కబ్జాను అడ్డుకొని మాకు న్యాయం చేయండి: దొంతి రైతుల వేడుకోలు



శివ్వంపేట, జూలై 28 (జనంసాక్షి): శివంపేట మండలం దొంతి గ్రామ శివారులో ఉన్న సిమ్మ సముద్రం చెరువు కట్టను చీల్చి పరుపు బండపై పోస్తూ దానిని సాగు భూమిగా మారుస్తున్న వైనం ఒకటి బయటకు వచ్చింది. వివరాల లోకి వెళ్తే శివ్వంపేట మండలం దొంతి గ్రామ శివారు ప్రాంతం 136 సర్వే నంబర్ లో గ్రామానికి చెందిన కుంట వెంకటేష్ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సిమ్మ సముద్రం కట్టాను చీల్చి, దోజర్, జేసిబీ లా సహాయం లో అక్కడ రెండు ఎకరాలల్లో విస్తరించి ఉన్న పరుపు బండ పై మట్టి పోసి దానిని కబ్జా చేసి, సాగు భూమి గా మార్చివేస్తున్నాడని రైతులు చింతల సత్తయ్య, చింతల బాబు, గంట శ్యామ్, గంట శ్రీకాంత్ లు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందలాది ఎకరాల వేణుగోపాల స్వామి దేవస్థానం భూమిని గ్రామానికి చెందిన చాలామంది రైతులం ఖాస్తులో ఉండీ సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నామని రైతులు తెలిపారు. ఆ పరుపు బండపై సుమారు 20 మంది రైతులం 10 లారీల (వడ్లు) ధాన్యాన్ని ఆరబెట్టకునే వారమని తెలిపారు. ఆ బండపై మట్టి పోసి సాగు భూమిగా తీర్చిదిద్దడం వలన ఎంతోమంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి వద్ద 30 గుంటలు కొనుగోలు చేసిన వెంకటేష్ తనకు 4 ఎకరాల భూమి ఉన్నదని గ్రామంలో అసత్య ప్రచారం చేస్తూ, బండరాల భూమిని మొత్తం అక్రమంగా ఆక్రమించుకుంటున్నాడని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయంపై జిల్లా కలెక్టర్ అలాగే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ భూ కబ్జాను అడ్డుకొని మాకు న్యాయం చేయగలరని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

## మట్టి పరీక్షలతో నేల సారవంతత.. మెరుగైన దిగుబడులు

• రామచంద్రపూర్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం



నర్సాపూర్, జూలై 28 (జనంసాక్షి): గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం (RAWE)లో భాగంగా నర్సాపూర్ మండలంలోని రామచంద్రపూర్ గ్రామంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌కు చెందిన బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు మంగళవారం రైతులకు మట్టి పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి పరీక్షల ప్రాముఖ్యత, శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించే విధానం, సాయిల్ హెల్త్ కార్డు అవసరం, దాని ప్రయోజనాలను రైతులకు వివరించారు. మట్టి పరీక్షల ద్వారా నేలలోని పోషకాల స్థితిని తెలుసుకుని, అవసరానికి అనుగుణంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని, సారవంతతను కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సిమ్మి తానియా, శ్రీకరిని, వాసవి, హర్షిత నిర్వహించగా గ్రామ రైతులు పాల్గొని మట్టి పరీక్షలపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

• చేర్యాల మండల విద్యాధికారి బైర నరేందర్



చేర్యాల, జూలై 28 (జనంసాక్షి): రాష్ట్ర విద్యాశాఖ ప్రతి విద్యా సంవత్సరం పాఠశాల స్థాయిలో విద్యా నైపుణ్యాలను మెరుగు పరచడానికి ఉపాధ్యాయులకు వృత్యంత శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రారంభంలో ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ రెండు విడుదల కార్యక్రమంలో భాగంగా రెండవ సెషన్ ఆదర్శ పాఠశాల ముస్త్యాల యందు నిర్వహించారు. రెండో విడత రెండవ రోజు చేర్యాల మండల విద్యాధికారి బైర నరేందర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రాథమిక పాఠశాల స్థాయిలో మూడు అంశాలు తెలుగు,ఆంగ్లము, గణితములలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని యాభై శాతం ఉపాధ్యాయులు మొదటి విడతలో రెండో విడతలో 50శాతం మంది ఉపాధ్యాయులకు శిక్షణ జరుగుతుందని తెలియజేస్తూ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఆర్పీలు చెప్పిన అంశాలను పాఠశాల స్థాయిలో పాటిస్తూ విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా ఉపాధ్యాయులు పాఠశాల తరగతి గదిలో అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్పీలు సిహెచ్ నరేష్, శ్రీకాంత్, వేణు, సంతోష్ మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్హేర్ రైతు వేదికలో ఘనంగా రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సంబరాలు




కల్హేర్, జూలై 28 (జనంసాక్షి): కల్హేర్ మండల రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ 100వ ఎపిసోడ్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ముగ్గురు రైతులు, ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులను ఎంపిక చేసి సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా తరఫున జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, సంతోష్ కుమార్‌లను ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారులుగా గుర్తించి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి చేతుల మీదుగా మెమొంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన రైతు గంజాయి మోహన్‌ను ఉత్తమ రైతుగా ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం చేరువవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ కార్యాలయ ఏడీఏ శ్రీదేవి, ఏఓ రమ్య, నారాయణఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, ఏఓ వెంకటేశం, ఏఈఓ సాయిలు, నాగేందర్, కృష్ణవేణితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీల్ అసిస్టెంట్‌ల మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

- ప్రతి నెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎంపీడీఓకు వినతి పత్రం



సంగారెడ్డి, జూలై 28 (జనంసాక్షి): మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పి.అశోక్ మాట్లాడుతు ఉపాధి హామీలో పనిచేసే ఫీల్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని అన్నారు వేతనాలు రాకుంటే వాల్లు ఎలా జీవిస్తారని పని భారం పెరుగుతుంది తప్పు వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం అన్యాయమని కేంద్ర ప్రభుత్వం పతకం పేరు మార్చింది తప్ప వేతనాలు మాత్రం సకాలంలో ఇవ్వడం లేదు రాష్ట్ర ప్రభుత్వం కూడా అందరు ఉద్యోగులకు ఒకటో తేదినే వేతనాలు ఇస్తున్నామని చెబుతుంది రాష్ట్ర ప్రభుత్వానికి ఫీల్డ్ అసిస్టెంట్ లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు వెంటనే వేతనాలు చెల్లించాలని అలాగే ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభాకర్,విద్యాసాగర్., నాగభూషణం గౌడ్,దివాకర్,సునీత,అనిత,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- నర్సాపూర్‌లో వార్డులను పరిశీలించిన ఆవుల రాజిరెడ్డి




నర్సాపూర్, జూలై 28 (జనంసాక్షి): నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 4, 5, 8 వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం పరిశీలించారు. నర్సాపూర్ నియోజక వర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అన్వేష్‌రెడ్డితో కలిసి వార్డులను సందర్శించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, ఓటరు జాబితా సవరణను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా కీలకమని పేర్కొన్న ఆవుల రాజిరెడ్డి, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ఎస్ఐఆర్ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, నాయకులు రవి, ప్రవిన్ కుమార్,రియాస్,సాగర్, తదితరులు పాల్గొన్నారు

## మాతృ,శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు: జిల్లా ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, జూలై 28 (జనంసాక్షి): జిల్లాలో ప్రసవాల సమయంలో మాతృ, శిశు మరణాలు జరగకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భధారణ ప్రారంభం నుంచే గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాతృ, శిశు మరణాల ఆడిట్‌తో పాటు గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి & పిఎన్ డిటి – 1994) అమలును సమీక్షించారు. ఇటీవల నమోదైన ప్రతి మాతృ, శిశు మరణ ఘటనను కేసు వారీగా పరిశీలించి, మరణాలకు దారితీసిన కారణాలు, వైద్య సేవల్లో లోపాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రతి గర్భిణి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తల్లి-శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. అలాగే జిల్లాలో పిసి& పిఎన్ డిటి చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తికి జాతీయ గుర్తింపు

- గుడికందుల పద్మకు శ్రీ విశ్వకర్మ జాతీయ అవార్డు



నంగునూరు, జూలై 28 (జనంసాక్షి): అంకితభావంతో మహిళా సాధికారతకు కృషి చేసి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సమాజ సేవలకు గుర్తింపుగా నంగునూరుకు చెందిన సామాజిక కార్యకర్త గుడికందుల పద్మ ప్రతిష్ఠాత్మక "శ్రీ విశ్వకర్మ జాతీయ అవార్డు" అందుకోవడం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. సేవను లక్ష్యంగా చేసుకుని నిశ్శబ్దంగా పనిచేసే వ్యక్తులకు జాతీయ స్థాయిలో లభించే గుర్తింపు అరుదైనదే. అలాంటి గుర్తింపును పద్మ అందుకోవడం ఆమె సామాజిక సేవా ప్రయాణానికి మరో మైలురాయిగా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ పశ్చిమ భారతదేశ సదస్సు సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సంయుక్తంగా పద్మను సన్మానించి అవార్డును అందజేశారు.

గుడికందుల పద్మ సామాజిక సేవా రంగంలో ఎన్నో సంవత్సరాలుగా చురుకుగా పని చేస్తున్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆమెతో కలిసి పనిచేసినవారు చెబుతున్నారు. మహిళల్లో విద్య, స్వయం ఉపాధి, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాలు ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం వంటి అంశాలు ఆమె సేవల్లో ప్రధానంగా నిలిచాయి. అవార్డు ప్రదానోత్సవంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవించడం ద్వారా మరింత మంది సేవా కార్యక్రమాల వైపు ఆకర్షితులవుతారని అన్నారు. అవార్డులు వ్యక్తిగత విజయాలకు మాత్రమే కాకుండా సమాజాభివృద్ధి కోసం పనిచేసే వారికి ప్రోత్సాహంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకు రావడంలో సేవాభావంతో పనిచేసే వ్యక్తుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సామాజిక సేవకులు, సాహితీ వేత్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విద్య, సాహిత్యం, సామాజిక సేవ, ప్రజా సంక్షేమం వంటి విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురిని జాతీయ అవార్డులతో సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గుడికందుల పద్మకు జాతీయ స్థాయి అవార్డు లభించడం నంగునూరు ప్రాంత ప్రజల్లో ఆనందాన్ని నింపింది. సమాజంలో మార్పు కోసం నిశ్శబ్దంగా కృషి చేసే వ్యక్తుల సేవలు చాలా సందర్భాల్లో వెలుగులోకి రావు. అలాంటి సేవకులకు జాతీయ స్థాయిలో లభించే గుర్తింపు వారి కృషికి సముచిత గౌరవాన్ని అందిస్తుంది. గుడికందుల పద్మకు లభించిన "శ్రీ విశ్వకర్మ జాతీయ అవార్డు" ఆమె వ్యక్తిగత విజయమే కాదు. సమాజ సేవ పట్ల ఉన్న అంకితభావానికి లభించిన గౌరవంగా నిలిచింది. ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజాసేవ కార్యక్రమాలను కొనసాగించేందుకు ఆమెకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా జలసిరి కార్యక్రమం



నిజాంపేట, జూలై 28 (జనంసాక్షి): నిజాంపేట మండల పరిధిలోని పొకట్పల్లి గ్రామంలో విబిజిరామ్‌జి పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ మదావత్ సునీత సమక్షంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పంట పొలాల్లో పంట కుంట, ఊరికి ఊట కుంట,కమ్యూనిటీ సోక్ పిట్, బోర్ వెల్ రీచార్జ్ తదితర పనులపై ప్రొజెక్టర్ సహాయంతో అవగాహన కల్పించి ఇట్టి పనులు చేపట్టడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని అలాగే కూలీలకు ఉపాధి లభిస్తుందని తద్వారా ఎల్‌నినో వాతావరణ మార్పులను కూడా తట్టుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జితేందర్, ఆశవర్కర్ సునీత, వార్డు మెంబెర్స్, గ్రామస్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లింగాపూర్‌లో విత్తన మేళా..



నర్సాపూర్, జూలై 28 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండలం లింగాపూర్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. అనంతరం రైతుల కోసం విత్తన మేళా నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన కూరగాయలు, మొక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు, పశుగ్రాస విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీని రైతులకు అందుబాటులో ఉంచారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీఆర్ వీకే) శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ ఆరుతడి పంటల ప్రాధాన్యం, సాగులో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ రాజుకళా శ్రీనివాస్ గుప్తా, ఉపసర్పంచ్ రవి, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, తేజస్విని, రాజశేఖర్, లావణ్య, దుర్గాప్రసాద్, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## పోతంశెట్టిపల్లి గ్రామంలో
# 100 శాతం సమగ్ర ఓటర్ సర్వే పూర్తి



**కొల్చారం, జూలై 28 (జనంసాక్షి):** కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో 100 శాతం సమగ్ర ఓటరు సర్వే పూర్తి కావడంతో మంగళవారం బీఎల్వోలు, వివిధ రాజకీయ పార్టీల బూత్ అధ్యక్షులు, ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొల్చారం మండల డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ, జీపీఓ రవీందర్ హాజరై సర్వే ప్రక్రియ, నమోదైన వివరాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, నంగునూరు గౌరీశంకర్, గడ్డమీది నరసింహులు, కొమ్ముల రాజా గౌడ్, గొల్ల ఎగొండ, సాయిని నర్సింలు, బీఎల్వోలు అనిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# హుమ్నాపూర్‌లో పారిశుద్ధ్య చర్యలు

- మొరం వేయడంతో మెరుగుపడ్డ దారులు

**న్యాల్‌కల్, జూలై 28, (జనంసాక్షి):** మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలోని పలువార్డుల్లో నెలకొన్న అపరిశుభ్రతను మెరుగు పరిచేందుకు గ్రామ పాలనాదికారి, పంచాయతీ అధికారులు దృష్టి సారించారు. గత రెండు రోజులుగా గ్రామ సర్పంచ్ చందు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ ప్రతాప్ రెడ్డిలు గ్రామంలో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలోని పలు కాలనీల్లో, అంగన్వాడి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్యాలయం, ప్రార్థనా లయాల ప్రదేశాలు, ప్రధాన జనసంచార ప్రదేశాల కూడలీలు, తదితర చోట్ల మొరం వేసి మెరుగు పరిచారు. వాహన చోదకులు, ప్రయాణికుల రాకపోకలకు దారులను మెరుగు పరచడంతో గ్రామస్తులు డి.రాజు, శ్రీకాంత్, షరీఫ్, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.



# సెప్టెంబర్ 1తేదీలోపు పీఆర్సీ ప్రకటించాలి... సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

- పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లా రెడ్డి

**మెదక్ టౌన్, జూలై 28 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగులకు సెప్టెంబర్ ఒకటవ తేదీ లోపు పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మల్లారెడ్డి మంగళవారం రోజు మెదక్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
పిఆర్సి ప్రకటన ఇప్పటికే మూడేళ్లు ఆలస్యమైందని ఇప్పటివరకు 6 డిఏలు పెండింగ్లో ఉండడం విచారకమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను వెంటనే రద్దుచేసి, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలని ఆయన అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన హెల్త్ కార్డు విధి విధానాలు ఖరారు చేసి తక్షణమే ఆగస్టు ఒకటో తేదీ వరకు అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్య చికిత్స అమలయే విధంగా చూడాలన్నారు .సర్వీస్ రూల్స్ ను అమలు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి పోస్టులను మరియు డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న కేజీబీవీ మోడల్ స్కూల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే పిఆర్టీయూ రాష్ట్రశాఖ, ఉద్యోగ జేఏసీ



ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని వారు అన్నారు. ఈ సమావేశం లో పీఆర్టీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు నందవరం రఘు బాబు, రాజేందర్ రెడ్డి, పీఆర్‌టీయూ హవేలీ ఘనపూర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**చేర్యాల, జూలై 28 (జనంసాక్షి):** చేర్యాల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా పర్యటించి శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా వార్డులో మురికి నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, డ్రైనేజీ ఉన్న పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ పి మమత, అశవర్కర్ తుమ్మలపల్లి రమ, మున్సిపల్ సిబ్బంది ఎండి జానూ, గుర్జకుంట అంజయ్య,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌లకు గౌరవ వేతనం
# ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

- విబీజీ-రామ్‌జీ పనుల్లో చెక్ పవర్ కల్పించాలి

**బెజ్జంకి, జూలై 28,(జనంసాక్షి):** రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌లకు తగిన గుర్తింపు,అధికారాలు కల్పించి గ్రామాభివృద్ధిలో వారి పాత్రను మరింత బలోపేతం చేయాలని కోరుతూ బెజ్జంకి మండల ఉపసర్పంచ్‌లు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు దీటి బాలనర్సు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు గౌరవ వేతనం,తగిన అధికారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అందరూ ఉపసర్పంచ్‌లకు గౌరవ వేతనం కల్పించాలని,వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ (విబి–జి–రామ్ జి) పనుల్లో చెక్ పవర్ కల్పించాలని కోరారు. అలాగే మండల సర్వసభ్య సమావేశాలకు ఉపసర్పంచ్‌లను తప్పనిసరిగా ఆహ్వానించాలని,గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌ల పేర్లను కూడా పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్ చట్టం ద్వారా ఉపసర్పంచ్‌లకు కల్పించిన అధికారాలను పూర్తిస్థాయిలో అమలు చేసి,గ్రామ పాలనలో వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల ఉపసర్పంచ్ లు దుమాల మహేష్, వీరేశం, పరశురాం, శ్రీకాంత్, త్రిశూలు, వినీత్, శ్రీనివాస్ రెడ్డి, పుష్పలత, మోహన్, లావణ్య, సంపత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# జైల్ భరోను విజయవంతం చేయాలి

- సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

**నర్సాపూర్, జూలై 28 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నర్సాపూర్ పట్టణంలో ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, గిట్టుబాటు ధరలు, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, పంట బీమా సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు.
గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, కార్మికులకు ఏడాదికి 100 రోజుల ఉపాధి కల్పించాలని కోరారు.



అలాగే ఆహార భద్రత, కార్మిక చట్టాలు, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గ్రామాలు, బస్తీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నపూర్ణ, సురేష్, శివ, చందర్, నాగభూషణం, రెడ్యానాయక్, ప్రవీణ్, నర్సింలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

- మల్యాల విద్యార్థిని షణ్ముఖ ప్రియ

**నంగునూరు, జూలై 28 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బానోతు షణ్ముఖప్రియ స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించడం అత్యంత ప్రతిభ, కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ విజయంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో గట్ల మల్యాల ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రధానోపాధ్యాయులు మాదాసి రమేశ్ మాట్లాడుతూ షణ్ముఖ ప్రియ సాధించిన విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం గొప్ప విజయమని పేర్కొన్నారు. విద్యార్థినిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు దర్శనాల రాజ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ సర్పంచి ఇంగ నరేశ్, ఉపసర్పంచ్ తిప్పని శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ తిరుమలతో, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. షణ్ముఖ ప్రియ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే అత్యున్నత విజయాలను సాధించగలరనే విషయాన్ని షణ్ముఖ ప్రియ నిరూపించిందని గ్రామస్తులు, ఉపాధ్యాయులు కొనియాడారు. ఆమె విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## అన్నదాతలు ఆరుతడి
# సాగుపైనే అధికంగా దృష్టి సారిస్తేనే మేలు

- ఎల్‌నీనో ప్రభావంతో.. తీవ్ర వర్షాభావం



**న్యాల్‌కల్, జూలై 28, (జనంసాక్షి):** ఎల్‌నీనో ప్రభావంతో.. "తీవ్ర వర్షాభావం" నెలకొనే ఆస్కారం అధికంగా ఉందని, అందుకు ప్రత్యాన్మయంగా అన్నదాతలు ఆరుతడి పంటల సాగుపై అధికంగా దృష్టి సారించాలని, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వర్షాభాగం నెలకొనె ఆస్కారం అధికంగా ఉందని, వర్షాభావ నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, అందుకు ప్రత్యాన్మయంగా రైతులు ఆరుతడి పంటల సగకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మామిడిగి గ్రామ రైతు వేదికలో నిర్వహించిన "రైతు నేస్తం" కార్యక్రమంలో భాగంగా.. పంటల మార్పిడి, ఎల్ నీనో, వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, తగ్గనున్న భూగర్భ జలాలు, నూనె దినుసుల సాగు, తదితర అంశాలపై వ్యవసాయ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచించారు. రైతులు ప్రధానంగా చిరు, పప్పు ధాన్యాల సాగు, ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించి "రైతు నేస్తం" కార్యక్రమాన్ని రైతులు సద్వినిగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల పీహెచ్‌సీని

## ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

- రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి..
- ఆరోగ్య సేవలు మరింత మెరుగుపర్చాలని సూచన



**గుమ్మడిదల, జూలై 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లలితా దేవి మంగళవారం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ సేవలు, ప్రసూతి సేవలు, ల్యాబ్ పరీక్షలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. డెలివరీ సేవలు, మాతా–శిశు సంక్షేమ కార్యక్రమాల అమలు, టీ–హబ్ ద్వారా నిర్వహిస్తున్న ల్యాబ్ పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ, ప్రజలకు అన్ని ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని, సంగారెడ్డి జిల్లాను తెలంగాణలో ఆరోగ్య సేవల పరంగా అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. మాతా–శిశు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో ఉండటానికి ఆరోగ్య సిబ్బంది కృషే కారణమని ఆమె ప్రశంసించారు. ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ మధుకర్‌తో పాటు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి ఒరిజినల్ మెమో పోగొట్టుకున్న విద్యార్థిని

- సమాచారం అందించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి



**నారాయణఖేడ్ జూలై 28 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలంలోని సర్పంచ్ తాండకు చెందిన జాదవ్ సురేఖ తన పదో తరగతి ఒరిజినల్ మెమోను పోగొట్టుకుంది. జాదవ్ విటల్, ఆనిషి బాయి దంపతుల కుమార్తె అయిన సురేఖ ఇటీవల తన బ్యాగులో ఉన్న పదో తరగతి మెమో కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెమో కోసం అన్ని చోట్ల వెతికినా ఇప్పటివరకు ఆచూకీ లభించలేదని వారు పేర్కొన్నారు. విద్యార్థి భవిష్యత్ చదువులు, ఉన్నత విద్యలో ప్రవేశాలు, ఉద్యోగ అవకాశాలకు పదో తరగతి మెమో అత్యంత కీలకమైన పత్రం కావడంతో దానిని తిరిగి పొందేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఎవరికైనా ఆ మెమో దొరికినా లేదా దాని గురించి ఏవైనా వివరాలు తెలిసినా వెంటనే 9398567556 నంబర్‌కు సంప్రదించి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## గుప్తనిధుల తవ్వకాల కేసు

# ఛేదించిన ఉప్పునుంతల పోలీసులు

- నలుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మామిళ్లపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు జరిపిన కేసును ఉప్పునుంతల పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన ఇటీవల స్థానికంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

పోలీసుల వివరాల ప్రకారం, మామిళ్లపల్లి గ్రామ సర్పంచ్ ఫిర్యాదు మేరకు గ్రామ శివారులోని నల్లకుంట వద్ద గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గుర్తించి ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై పుట్ట మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఈ సందర్భంగా ఎస్సై పుట్ట మహేష్ మాట్లాడుతూ, గుప్తనిధుల పేరుతో అక్రమ తవ్వకాలు జరపడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తవ్వకాలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# ఎస్ఐ ఏకపక్ష ధోరణి వీడాలని బీఆర్ఎస్ ధర్నా...

- పిర్యాదు అందుకోలేదని ఎస్ఐపై ఆరోపణలు
- ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని నాయకుల డిమాండ్
- బీఆర్ఎస్ నాయకులకు నచ్చచెప్పిన సీఐ



**ఝరాసంగం,జూలై 28(జనంసాక్షి):** పోలీస్ స్టేషన్కు పిర్యాదు తీసుకుని వచ్చిన బాధితుల పిర్యాదును స్వీకరించ లేదని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఝరాసంగం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఝరాసంగం గ్రామానికి చెందిన లొడ్డ శివకుమార్ ఆయన తల్లిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు సోమవారం సాయంత్రం అకారణంగా ఇంట్లో నుంచి ఈడ్చుకు వచ్చి విచక్షణా రహితంగా దాడి చేశారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితులు పిర్యాదు ఇవ్వడానికి వస్తే ఎస్ఐ పిర్యాదు స్వీకరించలేదని బాధితులు, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎస్ఐ పనితీరు మొదటి నుండి ఏకపక్షంగా ఉందని అధికార పక్షానికి కొమ్ముకాస్తు నిజమైన బాధితులకు న్యాయం చేయడం లేదని వారు ఆరోపించారు. గతంలో ఎల్గోయి గ్రామానికి చెందిన ఓ మహిళ మెడలో నుండి బంగారు గుండ్లు, వెండి కాళ్ళ కడియాలు దొంగతనం జరిగిందని బాధితురాలు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడానికి వస్తే పిర్యాదు అందుకోకుండా బాధితురాలిని దొంగతనం జరిగిన ఘటనా స్థలం చూపించాలని వాహనంలో తీసుకెళ్ళి అక్కడే అడవిలో వదిలేసిన ఘటన వివాదాస్పదమైందన్నారు.

పిర్యాదులకు సంబందించి ఇరువురిని పిలిపించి పరిష్కరించాల్సింది పోయి ఏకపక్షంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని వారన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న రూరల్ సీఐ జక్కుల హనుమంతు బాధితులు, బీఆర్ఎస్ నాయకులకు నచ్చచెప్పి పిర్యాదు స్వీకరించి నిందితులపై కేసు నమోదు చేస్తానని హామి ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎస్ఐ పై అధికారులకు చెప్పేది ఒక రకంగా ఉంటుందని క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పక్షానికి కొమ్ముకాస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని నాయకులు సీఐని కోరారు. ధర్నాలో మండల పార్టి అధ్యక్షులు వెంకటేషం, మాజీ సర్పంచ్ జగదీశ్వర్, నాయకులు సంగమేశ్వర్, నాగన్నపాటీల్,నాగన్న సజ్జన్షెట్టి. బాల్రాజ్, బొజిరెడ్డి, నవాజ్రెడ్డి, ఉల్లాస్, శివ శంకర్ పాటిల్, ఐజాజ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి

- బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్



**వెల్దుర్తి, జులై 28 (జనంసాక్షి):** సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో అధికారులు, నాయకులు, ప్రజలు సహకరించాలని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ అన్నారు మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తి లో నిర్వహించిన మండల ప్రవాస అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కర్రి వెంకటేశం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దాసు మాజీ మండల పార్టీ అధ్యక్షులు కోదండ శేఖర్ గౌడ్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ బీఎల్ఏ సమావేశంపై బీఆర్ఎస్వీ ఆందోళన



**తెల్కపల్లి, జూలై 28,(జనంసాక్షి):** మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ సమావేశం నిర్వహించడాన్ని బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువ నాయకులు మంగళవారం తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ కార్యక్రమాలకు వినియోగించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని వారు ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తాత్కాలికంగా వలస వెళ్లిన ఓటర్లను శాశ్వత వలస వెళ్లిన వారిగా నమోదు చేసి, ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. శాశ్వత వలస కింద నమోదు చేసిన ఓటర్ల వివరాలను వెంటనే పునఃపరిశీలించాలని, ఎన్నికల కమిషన్ ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతసాగర్ మాజీ సర్పంచ్ అతినారపు విష్ణు సాగర్‌తో పాటు బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువ నాయకులు పాల్గొన్నారు.

## మెదక్ పట్టణంలో ఎడతెరిపి వర్షాలు

- వార్డులలో గల లోతట్టు ప్రాంతాలను, మురికి కాలువలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**మెదక్ టౌన్, జులై 28, (జనంసాక్షి):** ప్రస్తుత వర్షాకాలంలో గత రెండు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఈ రోజు మెదక్ పట్టణం లో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కానుగు రాధిక భూపతి రాజు మరియు మున్సిపల్ కమిషనర్ శ్రీ వై నవీన్ గారు మెదక్ పట్టణంలోని 12, 18 మరియు 29 వార్డులలో గౌరవ వార్డు కౌన్సిలర్‌తో కలిసి పర్యటించి వార్డులలో గల లోతట్టు ప్రాంతాలను, మురికి కాలువలను పరిశీలించడం జరిగింది. కురుస్తున్న వర్షాల వలన వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన తక్షణ ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించడం జరిగింది. ఈ పర్యటనలో చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధన్వాడ మండల కేంద్రంలో ఘనంగా గజ్జలమ్మ దేవి ఉత్సవాలు

- పెద్ద బోనం కుండ ఎత్తిన చిట్టెం రాఘవేందర్ రెడ్డి
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**ధన్వాడ జూలై 28 (జనంసాక్షి):** ధన్వాడ మండల కేంద్రంలో గజ్జలమ్మ దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టెం రాఘవేందర్ రెడ్డి సంప్రదాయబద్ధంగా పెద్ద బోనం కుండను ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బోనాల ఉత్సవాల్లో మహిళలు, యువత, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం భూభారతి రి సర్వే

• తహసిల్దార్ నాగజ్యోతి



నిజాంపేట్, జులై 28(జనంసాక్షి): భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన భూ భారతీ రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ నాగజ్యోతి కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఖానాపూర్.బి లో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గ్రామ పరిధిలో 1029 ఎకరాల విస్తీర్ణంలో 58 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. 1936లో నిజాంకాలంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా సర్వే నిర్వహించి భూముల హద్దులు నిర్ణయించారన్నారు. ప్రస్తుతం ఆత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రేఖాంశాలు, ఆకాంక్షాల ఆధారంగా మ్యాపింగ్ చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతో నమోదు కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే భూ వివాదాలు లేకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. భూ రీ సర్వే సమయంలో అధికారులు అడిగే వివరాలను రైతులు సకాలంలో అందించి, భూముల హద్దులను చూపిస్తూ పూర్తి సహకారం అందించాలన్నారు. అందువల్ల రైతులు భూ భారతీ రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వరప్రసాద్, ఆర్ ఐ జాన్సన్, సర్వేయర్ మల్లేం, గ్రామ సర్పంచు గంగారాం, రెన్యు సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గురుపీఠంలో ప్రత్యేక పూజలు

• ధర్మాధికారి శివోపాసకులు వామన శర్మ



శివ్వంపేట, జులై 28 (జనంసాక్షి): ఈ నెల 29న బుధవారం వ్యాసపౌర్ణిమ (గురుపూర్ణిమ)ను పురస్కరించుకుని గూడూరు గ్రామ శివారులోని శ్రీ గురుపీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రముఖ యజుర్వేద వేద పండితులు, శివోపాసకులు, శ్రీ గురుపీఠం ధర్మాధికారి శాస్త్రుల వామన శర్మ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ గురుపీఠంలో ప్రత్యేక పూజలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గురుపీఠంలో ఉదయం 8 గంటలకు మహాగణపతి పూజ, ఆ తర్వాత శ్రీ దత్త పంచాయతన మూర్తులకు వేద పండితులచే లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము, ఆ దత్తాత్రేయ స్వామి వారికి విశేష చతుష్షష్ట్యుపచార మహాపూజ, ఉదయం 10 గంటలకు దత్తాత్రేయ మూల మంత్ర హోమం, గురు చరిత్ర, స్తోత్ర పారాయణములు, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, మహామంత్రపుష్పం, మహా మంగళ హారతి, మహాదాశీర్వచనము, గురు పీఠానికి తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరుపబడుతుందన్నారు. అదేవిధంగా సాయిబాబా దేవాలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు జరుపబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన, మన, ధన, వాస్తు, రూపేణా సహకరించి దత్తాత్రేయ గురు పరంపరా పరిపూర్ణ అనుగ్రహ ఆశీస్సులు పొందగలరని కోరుతున్నామని ట్రస్ట్ సభ్యులు శాస్త్రుల వామనశర్మ వేదపండితులు తెలియజేశారు.

### మెదక్ పట్టణంలో

## దంచికొడుతున్న వానలు

• జలమయమైన రోడ్డు రహదారులు

మెదక్ టౌన్, జులై 28, (జనంసాక్షి): ప్రస్తుత వర్షాకాలంలో గత రెండు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఈ రోజు గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కాసుగు రాధిక భూపతి రాజు గారు మరియు మున్సిపల్ కమిషనర్ శ్రీ వై నవీన్ గారు మెదక్ పట్టణంలోని 12, 18 మరియు 29 వార్డులలో గౌరవ వార్డు కౌన్సిలర్ గార్లతో కలిసి పర్యటించి వార్డులలో గల లోతట్టు ప్రాంతాలను,మురికి కాలువలను పరిశీలించడం జరిగింది. కురుస్తున్న వర్షాల వలన వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన తక్షణ ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలకు మరియు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించడం జరిగింది. ఈ పర్యటనలో గౌరవ చైర్పర్సన్, గౌరవ మున్సిపల్ కమిషనర్ గారు, గౌరవ కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



చిన్నశంకరంపేట, జులై 28(జనంసాక్షి): ప్రీ ప్రైమరీ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధి చందంపేట గ్రామంలో ప్రీ ప్రైమరీ సెక్షన్ పాఠశాలను స్థానిక సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రీ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సిములు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఇంచార్జ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుకు జలకళ.. అన్నదాత సంతోషం



పాపన్నపేట, జులై 28 (జనంసాక్షి): మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా జలాశయానికి జలకళ సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలతో చేరిన నీటితో వనదుర్గా ప్రాజెక్ట్ నిండిది. మంగళవారం దిగువకు 1500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. దీంతో జలాశయానికి పర్యాటక శోభ వచ్చింది. నది పరివాహక ప్రాంత అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు.

## కొమురవెల్లి మండలం తపస్‌పల్లి గ్రామంలో ఉద్రిక్తత..



కొమురవెల్లి, (జనంసాక్షి): మృతదేహంను ఇంటిముందు వేసి న్యాయం చేయాలని ధర్నా చేసిన సంఘటన కొమురవెల్లి మండలం తపస్పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏదురేదురుగా వచ్చిన రెండు బైక్‌లు గత 15 రోజుల క్రితం జరిగిన యాక్సిడెంటే లో సిద్దిపేట మండలం బొగ్గులోని కుంట కు చెందిన బైరి చార్లెస్ (25) తీవ్రంగా గాయపడి, హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. చార్లెస్ మృతికి కొమురవెల్లి మండలం తపస్పల్లి చెందిన రుద్రారం కనుకయ్య కారణమని మృత దేహాన్ని వారి ఇంటిముందు వేసి చార్లెస్ కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని బైరి చార్లెస్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సద్దుమనిగిన ధర్నా.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నవీన్ గుప్తా దాదాపు ఖరారు..?

• తిరుగులేని రాజకీయ శక్తిగా కాంగ్రెస్



శివ్వంపేట, జులై 28 (జనంసాక్షి): క్షేత్రస్థాయిలో తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ హైకమాండ్ ఆ దిశగా పావులు కదుపుతోంది. కిందిస్థాయిలో బలమైన నాయకుడిని మండల పార్టీకి ఎంపిక చేస్తేనే ఆ దిశగా పనిచేసే నాయకత్వం తమకు లభిస్తుందని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం భావిస్తున్నది. అందులో భాగంగానే శివంపేట మండలం పార్టీ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పులిమామిడి నవీన్ గుప్తాను నియమించే అవకాశాలు సుస్పష్టంగా ఉన్నాయని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది . 2011 సంవత్సరం నుండి నర్సాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పులిమామిడి నవీన్ గుప్తా పనిచేయడం జరిగింది. అదేవిధంగా అప్పటి ప్రభుత్వంలో 2013 సంవత్సరంలో పులిమామిడి గుప్తా సతీమణి ప్రవంతి శివంపేట సర్పంచిగా భారీ మెజార్టీతో గెలుపొందడం పొందారు. కాలక్రమేనా యువ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తాకు 2017 చివరి సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యేతో విభేదాలు కారణం వల్ల పులి మామిడి గుప్తా టిఆర్ఎస్ పార్టీలో చేరారు.

అయితే యువ నాయకుడైన నవీన్ గుప్తాను గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించగా, దానికి సానుకూలంగా స్పందించిన నవీన్ గుప్తా 2023లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ల సమక్షంలో పులిమామిడి గుప్తా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. అప్పటినుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలు కావచ్చు, ప్రభుత్వ కార్యక్రమాలు కావచ్చు వాటి విజయవంతానికి నవీన్ గుప్తా విశేషంగా కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకామాండ్ ఏ పిలుపు ఇచ్చిన మండలంలో నవీన్ గుప్త ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం విజయవంతం అయ్యేవిధంగా కృషి చేస్తున్నారు. మండలానికి కాంగ్రెస్ పార్టీ బడా నాయకులు ఎవరు వచ్చినా పులిమామిడి గుప్తా ఆధ్వర్యంలోనే వారికి భారీ స్వాగతం పలుకుతున్నారు. టి పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, తదితర ముఖ్య నేతలు కాంగ్రెస్ పార్టీకి నవీన్ గుప్తా చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్టాన వర్గం మండల పార్టీ అధ్యక్షులుగా నియమించే నవీన్ గుప్తాను నియమించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సువాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిల సమక్షంలో పులిమామిడి నవీన్ గుప్తా పేరును అధిష్టాన వర్గం వద్ద ఉంచినట్లు తెలియ వస్తుంది. టిపిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డికి పులిమామిడి నవీన్ గుప్తా ముఖ్య అనుచరుడుగా కాగా, ఎవరితో ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరినీ కలుపుకపోవడంలో నవీన్ గుప్తాది అందెవేసిన చెయ్యి అని మండల శ్రేణులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల వ్యవహారాలను దగ్గర ఉండి విజయవంతం చేస్తున్న పులిమామిడి నవీన్ గుప్తాను మండల పార్టీ అధ్యక్షులుగా నియమించే అవకాశాలు లేకపోలేదు. నవీన్ గుప్తాను మండల పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తే మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

## విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ



మాగనూర్, (జనంసాక్షి): అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ కోఆర్డినేటర్ పాషాబై, తెలంగాణ సైకిలింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి. మల్లారెడ్డి, బి. విజయ కాంతారావు ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం ఆధ్వర్యంలో గత నెలలో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం లో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి 5 కి.మీ. రోడ్డు స్పీడ్ సైక్లింగ్ ఉమెన్స్ పోటీలలో మాగనూరు మండలం జడ్పీహెచ్ఎస్ వడ్ వాట్ పాఠశాల బాలికలు మమత, అశ్విని, శ్రావణి, మహేశ్వరి, స్పందన ,నవ్య శ్రీ, దివ్య, కృష్ణవేణి, నర్మదా, చందు, అక్షర, అమృత, రజిత ,నవ్య పాల్గొ నందులకు వారికి ఈ నెల 28న పాఠశాల లో సైకిలింగ్ మహిళ రైడర్స్ కు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, ఉపాధ్యక్షులు అడ్వకేట్ నరేందర్ సాగర్, జి. శివకుమార్, అంజి బై, పాఠశాల హెచ్ఎం పురుషోత్తం సర్టిఫికెట్స్ ,మెడల్స్, అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మాట్లాడుతూ సైకిలింగ్ సర్టిఫికెట్స్ చాలా విలువైనవని ,స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలలో, స్పోర్ట్స్ స్కాలర్షిప్ కొరకు సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయని, నారీ శక్తిని, క్రీడా ప్రతిభను చాటి న సైకిలింగ్ మహిళా రైడర్స్ను అభినందించారు. హెచ్ఎం పురుషోత్తం, అడ్వకేట్ నరేందర్ సాగర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని సమాజంలో గౌరవం ఉంటుందని స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయిని తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పిడి రేణుక, అమ్మన్న, శ్రీనివాస్, భీమిరెడ్డి, శ్రీనివాసరావు, రాంగోపాల్, రవీందర్, శివకుమార్, మోహన్రావు, క్రాంతి కుమార్, మురళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 99% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

- బీఎల్ఏలకు రూ.14 లక్షల ప్రోత్సాహక నగదు అందజేసిన ఎమ్మెల్యే




**మెదక్ టౌన్, జూలై 28, (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అధ్యక్షతన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, మండల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 99 శాతం పూర్తయిందని తెలిపారు. ఈ విజయానికి బీఎల్ఏలు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, పార్టీ నాయకత్వం సమిష్టి కృషే కారణమని ప్రశంసించారు. ఇంకా ప్రక్రియ పూర్తి చేయని అర్హులైన పౌరులు వెంటనే లాంఛనాలు పూర్తి చేసుకోవాలని, వారికి అవసరమైన సహాయం అందించేందుకు కాంగ్రెస్ బీఎల్ఏలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో విశేషంగా పనిచేసిన 278 మంది బీఎల్ఏలకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.14 లక్షల ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. అలాగే తమ తమ మండలాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసిన ఇద్దరు బీఎల్ఏలను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు నిరంతర పర్యవేక్షణ, పార్టీ నాయకులతో సమన్వయం వల్లే ఈ స్థాయి పురోగతి సాధ్యమైందన్నారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఏలు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, బూత్‌స్థాయి ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొని నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషణతో పాటు నాణ్యమైన విద్యాతో తీర్చిదిద్దాలి

- చిన్నారుల బరువు,ఎదుగుదలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూలై 28(జనంసాక్షి);** పిల్లల పోషణతో పాటు వారి విద్యా పునాదులు బలంగా ఉండేలా అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గద్వాల మండలం చెనుగొనిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం,విద్యా బోధన, తదితర వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకు పునాది అంగన్వాడీ కేంద్రాల ద్వారానే నిర్మితమవుతుందని అన్నారు.పిల్లలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య, సామ్ - మామ్ స్టంటింగ్ సమస్యలు ఉన్న చిన్నారులను ముందుగానే గుర్తించి,వారికి ప్రత్యేక పోషకాహారం అందించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే తల్లిదండ్రులకు సమతుల్య పౌష్టికాహారం, శిశు సంరక్షణ, ఆరోగ్యకరమైన అలవాట్లపై నిరంతరం అవగాహన కల్పించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థవంతంగా బోధించి భవిష్యత్తు విద్యకు బలమైన పునాది వేయాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా పిల్లల బరువును పరిశీలించి, వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువు, ఆటపాటల గురించి అడిగి తెలుసుకున్నారు.పిల్లలు చురుకుగా ఉండడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులు ఇదే విధంగా బోధిస్తూ పిల్లలను మరింత చురుకుగా, క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, అంగన్వాడీ టీచర్,పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ




**గుండుమాల్, జూలై 28(జనంసాక్షి):** కొడంగల్ నియోజకవర్గంలోని గుండుమాల్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కొడంగల్ ఇంచార్జీ నీలి జనార్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ప్రకటించిన పాంచజన్యంలో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, రైతే రాజు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజలలోకి తీసుకెళ్తూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తూ కొడంగల్ నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో జెండా ఎగరవేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల కవితను తెలంగాణ ముఖ్యమంత్రిగా చూడాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ, తాను కూడా కొడంగల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే పోటీ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గుండుమాల్ మండల టిఆర్ఎస్ ఇంచార్జీగా ఆకుల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యకర్తలు, గ్రామ యువత పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా తీర్మానం



**జడ్చర్ల, జూలై 28 (జనంసాక్షి):** మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మాన పత్రాన్ని మంగళవారం జడ్చర్ల మండల తహసీల్దార్ నర్సింగ్ రావుకు అందజేశారు. గ్రామ సర్పంచ్ సుజాత అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామపంచాయతీ సభ్యులందరూ ప్లాంట్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల భద్రత, వ్యవసాయ భూముల సంరక్షణ, నివాస ప్రాంతాల రక్షణ దృష్ట్యా ఈ ప్లాంట్‌ను తమ గ్రామంలో ఏర్పాటు చేయడం తగదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం పూర్తిగా విరమించుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ రామకృష్ణ రెడ్డి, గ్రామస్తులు రాములు, ప్రశాంత్, పవన్, సందీప్, అంజి, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



# మరణించిన హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా బాండ్ అందజేత

- అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా జిల్లా పోలీస్ శాఖ
- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ,జూలై 28(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాలో అనారోగ్య కారణాలతో గత ఏడాది ఏప్రిల్ 18న మృతి చెందిన హోంగార్డు ఎం. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా మొత్తానికి సంబంధించిన బాండ్‌ను జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అందజేశారు. ఈ మేరకు జూలై 22న మృతుడి భార్య వి. కవిత ఖాతాలో రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తం జమ కాగా, అందుకు సంబంధించిన బాండ్‌ను హోంగార్డు ఇన్‌చార్జ్ ఆర్ఐ. టి. వెంకటేష్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఎం.ప్రవీణ్ కుమార్ 29 డిసెంబర్ 2003న హోంగార్డుగా విధుల్లో చేరారు. అనంతరం 2021లో నారాయణపేట జిల్లా నుంచి రొటేషన్ పద్ధతిలో జోగులాంబ గద్వాల జిల్లాకు వచ్చి విధులు నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖకు సేవలందించిన ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అందించిన ఎక్స్గ్రేషియా ఆర్థిక సహాయం కొంత మేరకు అండగా నిలిచింది.

# కార్గిల్ విజయ్ దివస్ పోటీల్లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ






**వెల్దండ, జూలై 28 (జనంసాక్షి):** సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఇటీవల నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ ఉత్సవాల సందర్భంగా జరిగిన గ్రూప్ పాటల పోటీలలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించారు. విజేతలకు రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డా. కె. రజిని ప్రియ మరియు టాసా ప్రధాన కార్యాలయ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ జి. శ్రీనివాసుల చేతుల మీదుగా ప్రథమ బహుమతి ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ సుమన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కరేలు విద్యార్థులను అభినందించి, వారి విజయానికి కృషిచేసిన సంగీత ఉపాధ్యాయులు సోను, మోసెస్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రీనా, అనిల్, మనీషా, రాహుల్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**గద్వాల, జూలై 28 (జనంసాక్షి):** గద్వాల జిల్లా గద్వాల డిపోలో పరమేశ్వరయ్య అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో యూనియన్ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ గోపాల్, హైదరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ వెంకటేష్, గద్వాల డిపో యూనియన్ గౌరవాధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఏడేళ్లుగా యూనియన్లపై నిషేధం ఉన్నా ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందని నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య పోరాటం వల్లనే ఆగస్టులో యూనియన్ ఎన్నికలకు ప్రభుత్వం అంగీకరించిందని, ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. PRC బకాయిలతో సహా నూతన వేతన సవరణ అమలు జరగాలని డ్రైవర్, కండక్టర్, గ్యారేజ్ సిబ్బంది పోస్టుల భర్తీచేస్తూ, జాబా బకాయిలను వెంటనే జమ చేయడం,అదనపు పని గంటల రద్దు చెయ్యెద్దని,కారుణ్య నియామకాల అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో ఉంటే హిస్టరీ షీట్లు క్లోజ్

- జిల్లా వ్యాప్తంగా రౌడీ మేళాలు
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి



సంగారెడ్డి బ్యూరో, జూలై 28 (జనంసాక్షి): సత్ప్రవర్తనతో ఉంటే హిస్టరీ షీట్లు క్లోజ్ చేస్తామని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డిలో రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీటర్లకు పోలీసులు "రౌడీ మేళా" కార్యక్రమాలు నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణ ఖేడ్ సబ్-డివిజన్లలో డీఎస్పీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. సత్ప్రవర్తన కనబరిచే హిస్టరీ షీట్లను నిబంధనల ప్రకారం మూసివేస్తామని తెలిపారు. చెడు నడక కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్: 8712656777కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## యూరియా ధరల వార్తలపై స్పష్టత


జడ్చర్ల, జూలై 28 (జనంసాక్షి): ఎరువుల విక్రయాలపై స్థానిక ప్రింట్ మీడియా లో వచ్చిన కథనంపై వ్యవసాయ శాఖ అధికారులు తమ నివేదికను డి.పి.ఆర్.ఓ కార్యాలయానికి వెల్లడించినట్లు డి.పి.ఆర్.ఓ కార్యాలయ సిబ్బంది మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జడ్చర్లలోని ఎంఎస్ న్యూ సప్తగిరి ట్రేడర్స్ దుకాణంలో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై మండల వ్యవసాయ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. తనిఖీల్లో సదరు సంస్థ ఎటువంటి ఎరువులను ఎం.ఆర్.పి. కన్నా ఎక్కువ ధరకు విక్రయించ లేదని, రైతుల నుండి ఎలాంటి అదనపు మొత్తాన్ని డిమాండ్ చేయలేదని స్పష్టం చేసినట్లు డి.పి.ఆర్.ఓ కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. విచారణ నివేదిక ఆధారంగా ఈ రిజాయిండర్‌ను సమర్పించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కేసు నమోదు

తెలకపల్లి, జూలై 28, (జనంసాక్షి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా తీవ్రంగా గాయపడినట్లు స్థానిక ఎస్సై యం.రమేష్ తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పులిమామిడి బాల్ జంగయ్య (50) సోమవారం మధ్యాహ్నం తన బైక్ (టీఎస్-31-2760)పై లింగాల రోడ్డులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా శ్రీ రామాంజనేయ రైస్ మిల్ సమీపంలో కుడివైపు పొలంలోకి మలుపు తిరుగుతుండగా, వెనుక నుంచి గౌరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్ముల శాంతయ్య తన బైక్ (టీఎస్-06 ఈడీ-1533)ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాల్ జంగయ్య కిందపడడంతో కుడి భుజం, పక్కటెముకులకు తీవ్ర గాయాలతో పాటు శరీరంపై ఇతర కాయాలైనట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, బాధితుడి భార్య పులిమామిడి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు స్థానిక ఎస్సై ఎం. రమేష్ తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- పోతేపల్లిగ్రామ సర్పంచ్ - తగుళ్ల కొండల్ యాదవ్



వెల్దండ, జూలై 28 (జనంసాక్షి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లిగ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్‌లి అన్నారు, ఇటీవల మరణించిన లిబోయిన్పల్లి అల్లాజీ గౌడ్ నేషనల్ ఫ్యామిలీ బెన్ఫిట్ స్కీమ్ కింద (లీఫీడీ)లి కింద కుటుంబంలో ప్రధాన ఆదాయం అనరుగా ఉన్న వ్యక్తి మరణించినప్పుడు నిరుపేద కుటుంబాలకు లిరూ.20,000/-లి నేరుగా భార్య అకౌంట్లోనే జమ చేయడం జరిగింది..ఇట్టి పథకాన్ని పోతేపల్లి గ్రామ ప్రజలు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరు.ఈ కార్యక్రమంలో లివార్డు సభ్యులు ఒ యువ నాయకులు బోయిన్పల్లి సాయన్నగౌడ్, ముంత మల్లేష్ యాదవ్, ఉడుత శివ యాదవ్,మార్కండేయుడు, ఎగిరిశెట్టి శివకుమార్, ఉడుత బాలు యాదవ్,అంజి యాదవ్, శ్రీశైలంలి తదితరులు పాల్గొన్నారు..

# మెదక్‌లో ఎస్ఐఆర్ నమోదు 99.61 శాతం

- బీఎల్ఏల కృషి అభినందనీయం
- మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి): మెదక్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో 99.61 శాతం నమోదు సాధించడం వెనుక బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏల సమిష్టి కృషి, అంకితభావమే ప్రధాన కారణమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ తరఫున బీఎల్ఏలుగా బాధ్యతలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరును కలిసి నమోదు ప్రక్రియను పూర్తి చేసిన కార్యకర్తలకు ఆమె అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశాలు, అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించిన బీఎల్ఏల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదు, వివరాల ధ్రువీకరణ, అవసరమైన సవరణలపై అవగాహన కల్పిస్తూ నిరంతరం శ్రమించడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బీఎల్ఏలు పూర్తి బాధ్యతతో పని చేశారని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంలో విశేష సహకారం అందించారని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేయడం వల్లే 99.61 శాతం నమోదు సాధ్యమైందని చెప్పారు. ఈ విజయంతో సంతృప్తి చెందకుండా 100 శాతం నమోదు లక్ష్యంగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని బీఎల్ఏలకు సూచించారు. ఇంకా నమోదు కాని అర్హులైన ఓటర్లను గుర్తించి వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె అన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో ఇదే క్రమశిక్షణ, సేవాభావంతో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో 99.61 శాతం నమోదు సాధనకు కృషి చేసిన ప్రతి బీఎల్ఏ, పార్టీ నాయకుడు, కార్యకర్తకు మరోసారి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రాయిలాపూర్ పాఠశాలకు ఉచిత బెంచీల పంపిణీ

కౌడిపల్లి, జూలై 28, (జనంసాక్షి): విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకుని విద్యాభివృద్ధి సాధించాలననే లక్ష్యంగా విజ్ఞాన జ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో కౌడిపల్లి మండలం రాయిలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 60 బెంచీలను ఉచితంగా అందజేశారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ దాత హరి సహకారంతో ఈ బెంచీలను పాఠశాలకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సరిపడా సౌకర్యాలు కూడా అవసరమని, దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాఠశాలకు 60 బెంచీలను అందించిన దాత హరికి పాఠశాల యాజమాన్యం, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాత హరి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

**పాఠశాల హెచ్ఎం ఉపేందర్ మాట్లాడుతూ...**

పాఠశాలలో బెంచీల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విరాళంతో ఆ సమస్య చాలా వరకు పరిష్కారమైందని చెప్పారు. దాత హరికి, విజ్ఞానజ్యోతి సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయిలాపూర్ గ్రామ సర్పంచ్ కుర్మా స్వప్న,షేకులు, ఉపసర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు, హెచ్ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విజ్ఞానజ్యోతి సొసైటీ సభ్యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## జైపాల్ రెడ్డి వర్ధంతి.. సేవకులకు పురస్కారాలు



మహబూబ్‌నగర్, రూరల్ జూలై 28(జనంసాక్షి): జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి 7 వ వర్ధంతి సందర్భంగా కళాశాల ఆవరణలో గల ఆయన విగ్రహానికి చిత్ర పటానికి కళాశాల ఛైర్మన్ కెఎస్ రవికుమార్ అధ్యాపక బృందము పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కె ఎస్ రవికుమార్ మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి జయంతి మరియు వర్ధంతి సందర్భంగా ప్రతి ఇద్దరు వ్యక్తులకు జైపాల్ రెడ్డి స్మారక స్ఫూర్తి పురస్కారాలను అందిస్తున్నామని, వర్ధంతి సందర్భంగా ఇద్దరు ప్రముఖ వ్యక్తులు విద్య రంగములో విశిష్ట సేవలు అందించిన విశ్రాంత అధ్యాపకులు శ్రీ ఆలూరు గంగయ్య రావూరి సూర్య నారాయణలకు జైపాల్ రెడ్డి స్మారక స్ఫూర్తి అవార్డులను అందచేస్తున్నామని, వాటిలో భాగంగా ఒక్కొకరికి 25000 రూపాయల చెక్కును అంద చేసి సన్మానించారు. జైపాల్ రెడ్డి నాకు 1984 నుంచి పరిచయము అని అతని దగ్గర శిష్యరికం చేశానని నన్ను దత్త పుత్రునిగా అనే వారని తెలిపారు. అతని స్ఫూర్తితో 1997 లో జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల స్థాపించమని తెలిపారు.ఈ సంవత్సరము 30 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామని తమ సంస్థల ద్వార సుమారు 30,000 ల మంది ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ భాస్కర్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపల్ డ్యాకృష్ణమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా చంద్రశేఖర్, సంస్థకు చెందిన డా. ఎ.నాగేందర్ సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు జగపతిరావు, నస్కంటి వీరన్న మరియు అధ్యపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### చిమనగుంటపల్లిలో

## కాంగ్రెస్, బీజేపీకి షాక్..

- బీఆర్ఎస్‌లోకి కార్యకర్తల చేరిక



వనపర్తి రూరల్, జూలై 27, (జనంసాక్షి): వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యమని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అప్రమత్తతతో వ్యక్తి ప్రాణాలు కాపాడిన రాజాపూర్ పోలీసులు

- సాంకేతిక పరిజ్ఞానంతో లొకేషన్ ట్రేస్ చేసి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసు సిబ్బంది
- విధి నిర్వహణలో అప్రమత్తత కనబరిచిన రాజాపూర్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

**రాజాపూర్, జూలై 28(జనంసాక్షి):** రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజు లాగే సోమవారం అర్ధరాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్ సిబ్బంది అప్రమత్తతతో ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. సోమవారం మధ్యరాత్రి సుమారు 1.00 గంటల సమయంలో రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన టంకరి రాజేష్ తండ్రి యాదయ్య కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుండి వెళ్లిపోయి తన భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన అతని భార్య తన ఇద్దరు చిన్న పిల్లలతో కంగారుగా వెతుకుతుండగా, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పీసీ-1170 సత్యనారాయణ గౌడ్ ఆమెను గమనించి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే ఆమె వద్ద నుంచి రాజేష్ మొబైల్ నంబర్ సేకరించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అతని లొకేషన్‌ను గుర్తించారు. అనంతరం పెట్రోలింగ్ సిబ్బంది అయిన పీసీ-1170 సత్యనారాయణ గౌడ్, హోంగార్డ్-639 ఖాజా ఖలీముద్దీన్, పెట్రోల్ మొబైల్ హోంగార్డ్-665 డ్రైవర్ నరేందర్ తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న రాజేష్‌ను సురక్షితంగా కాపాడి, కౌన్సెలింగ్ అనంతరం అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమయస్ఫూర్తితో స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన రాజాపూర్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అభినందిస్తూ, ఇలాంటి మానవతా దృక్పథంతో విధులు నిర్వహించడం పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సమస్యలు,



ఆర్థిక ఇబ్బందులు లేదా వ్యక్తిగత ఒత్తిళ్లు జీవితానికి ముగింపు కావు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. ఆత్మహత్య అనేది శాశ్వత పరిష్కారం కాదు. ఇలాంటి ఆలోచనలు వచ్చినప్పుడు వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించండి. సమయానికి తీసుకున్న ఒక నిర్ణయం విలువైన ప్రాణాలను కాపాడుతుంది.

## కృష్ణా నది ముంపు ప్రాంతానీ
# పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**కృష్ణ, జూలై 28 (జనంసాక్షి):** మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణా నది పరివాహక ముంపు ప్రాంతమైన వాసునగర్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ రామ్ లాల్, కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం. నవీద్‌తో కలిసి ముంపు పరిస్థితులు, నది ప్రవాహం, గ్రామంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎగువన ఉన్న కర్ణాటక లోని నారాయణపూర్ డ్యాం నుంచి వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించి ప్రజలకు సహాయం అందించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. నది తీర ప్రాంతాలకు ప్రజలు అనవసరంగా వెళ్లకూడదని, వరద ప్రవాహాన్ని చూడడానికి లేదా సెల్ఫీలు తీసుకోవడానికి నది వద్దకు చేరవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నారులను నది ఒడ్డుకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

# రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేటజిల్లా బ్యూరో, జూలై 28(జనంసాక్షి):** రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని 'రైతు నేస్తం' కార్యక్రమం చేరవేస్తోందని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. మంగళ వారం నారాయణ పేట మండలంలోని జాజాపూర్ రైతు వేదికలో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రీయ వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం అని, రైతులకు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడం, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించడం, వ్యవసాయంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం విజయవంతంగా 100వ ఎపిసోడ్‌ను పూర్తి చేసుకుందన్నారు. రైతులకు సరైన సమయంలో సరైన సాంకేతిక సలహాలు అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చని ఆమె తెలిపారు.

రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తే ఉత్పాదకత పెరగడంతో పాటు సాగు వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అధికారులు నేరుగా రైతులతో మాట్లాడి పంటల సాగు, తెగుళ్ల నివారణ, వాతావరణ మార్పులు, నీటి యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక రంగం, మత్స్యశాఖ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వంటి అనేక అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారని ఆమె చెప్పారు.

అనంతరం జిల్లాలో ముగ్గురు ఆదర్శ రైతులు, ఇద్దరు వ్యవసాయ విస్తీర్ణ అధికారులను మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తో కలిసి కలెక్టర్ సన్మానించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్ వ్యవసాయ శాఖ ఏవో, తదితరులు పాల్గొన్నారు.

## చెదురుపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఉచిత వైద్య శిబిరం అభినందనీయం: ధన్సింగ్ నాయక్



**వెల్దండ, జూలై 28 (జనంసాక్షి):** ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, హర్షించదగ్గ విషయమని చెదురుపల్లి గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ దన్ సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామంలో ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి సర్పంచ్ దన్సింగ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారుగా 250 మందికి సాధారణ పరీక్షలు, 200 మందికి బిపి , షుగర్ కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ఆసుపత్రి యజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెరుగు సహదేవ్, మరియు వార్డు సభ్యులు, డాక్టర్ విశ్వంత్, డాక్టర్ లింగం, కామినేని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ క్యాంప్ ఆర్డినేటర్ కే దేవేందర్, నర్సింగ్ స్టాఫ్ దేవిప్రియ, రోజా, ఆస్పత్రి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు ఉన్నారు.

# ఫీజుల బకాయి - మహిళా మోర్చా లడాయి

- 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం, మహిళా మోర్చా ఆందోళన
- ఫీజు బకాయిలపై గద్వాలలో మహిళా మోర్చా ఆందోళన
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు - మహిళా మోర్చా డిమాండ్



**గద్వాల, జూలై 28(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు ఈరోజు గద్వాల పట్టణంలోని ఎస్వి ఎం డిగ్రీ కళాశాలలో 'ఫీజుల బకాయి మహిళా మోర్చా లడాయి' కార్యక్రమాన్ని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమతా గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థినీ, విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సమతా గౌడ్ మాట్లాడుతూ గత 6-7 సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు సకాలంలో విడుదల కాకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపి వేయడం, పరీక్షలు రాయనివ్వకపోవడం చేస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక పిల్లల చదువులు ఆపే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో సకాలంలో ఫీజులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసిందని విమర్శించారు. రూ.15వేల కోట్ల పెండింగ్ బకాయిలను పూర్తిస్థాయిలో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలి. ఫీజు బకాయిల పేరుతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది విద్యార్థుల హక్కు, దానిని ప్రభుత్వం భిక్షగా చూడొద్దని, పేద విద్యార్థినీ, విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిలర్ శాలన్న, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అనిల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పరమేశ్వర రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## దాబాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- మరికల్ ఎస్ఐ విక్రమ్




**ధన్వాడ, జూలై 28 (జనంసాక్షి):** మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయించడం, మద్యం సేవించేందుకు అనుమతించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మరికల్ ఎస్ఐ విక్రమ్ హెచ్చరించారు.

మంగళవారం మరికల్ మండలంలోని పలు దాబాలు, హోటళ్లలో ఎస్ఐ విక్రమ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాబాల యజమానులు, నిర్వాహకులతో మాట్లాడి చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఎస్ఐ విక్రమ్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, దాబాలలో మద్యం సేవించేందుకు అనుమతించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. అలాంటి కార్యకలాపాలు గుర్తించిన వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దాబాలకు వచ్చే వినియోగదారులకు పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలగకుండా యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దాబాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గొడవలు, జూదం, మాదకద్రవ్యాల వినియోగం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

### తిరుమలదేవునిపల్లికి

## బిఎస్ఎస్ఎల్ టవర్ మంజూరు



**నారాయణపేట జూలై 28(జనంసాక్షి):** నారాయణపేట మండలం తిరుమలదేవునిపల్లి గ్రామానికి బి ఎస్ ఎన్ ఎల్ టవర్ ను భారత్ సంచార నిఘం మంజూరు చేస్తూ ఉత్తర్వు విడుదల చేసింది. అలాగే త్వరలోనే టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి ఒప్పందం కుదుర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ టవర్ మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు సెల్ ఫోన్ సిగ్నల్ అందుబాటులోకి వచ్చి ఇబ్బందులు తొలగుతాయని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఎంపీ డికే.అరుణమ్మ చొరవతో బిజెపి నాయకుడు శ్రీనివాసులు కృషితో బిఎస్ఎన్ఎల్ టవర్ మంజూరైనందున వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్ఐఆర్ రివ్యూ సమీక్షా సమావేశం



**మద్దూరు, జూలై 28 (జనంసాక్షి):** మద్దూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజు ఎస్ఐఆర్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్ గూళ్ళ నర్సిములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, అసెంబ్లీ కన్వీనర్ మాణిక్యం మిల్లేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసిన బీఎల్ఏలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ జంగం బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమంపై అవగాహన కల్పించిన సర్పంచ్



**నారాయణపేట, జూలై 28(జనంసాక్షి):** నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామ సర్పంచ్ గవి నోళ్ల శ్రీనివాస్ పాల్గొని గ్రామస్థులకు జలసిరిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల సిరి కార్యక్రమంలో భాగంగా వివిజి రాంజీ పథకం కింద గ్రామంలో ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, బోర్ రీఛార్జ్ గుంతల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించి నీటి నిల్వలను పెంచడం, భూగర్భ జలమట్టాన్ని మెరుగుపరచడం ఈ కార్య క్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రతి గ్రామస్తు డు ఈ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకుని నీటి సంరక్షణలోభాగస్వాములు కావాలని సర్పంచ్ గవి నోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజప్ప, వార్డు సభ్యులు ఉదయ్ కుమార్, అంజప్ప, శివకుమార్, పంచాయతీ కార్యదర్శి బిందు రాణి, నాయకులు ఆచరప్ప, ప్రవీణ్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యానికి

## ఓటు వజ్రాయుధం: కే.రతంగ్ పాండురెడ్డి




**నారాయణపేట జూలై 28(జనంసాక్షి):** ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం అని ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ లో పాల్గొని ఓటును సురక్షితం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి అన్నారు.ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస యోజన లో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రతంగ్ పాండు రెడి నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అక్కడే బసచేసి ఎస్ఐ ఆర్ నుపరిశీలించారు. మంగళవారం ఉదయం జాజాపూర్, బైరాంకొండ గ్రామాల్లో పర్యటించి బూత్‌ల వారిగా ఎస్ఐఆర్‌ను అడిగి తెలుసుకున్నారు.

పలు బూత్‌లలో వందశాతం పూర్తి కావడంతో బిఎల్ఓలను అభినందించి సన్మానించారు. మిగిలిన వారితో త్వరగా గడువు లోపు పూర్తి చేయించాలని అందుకు బిజెపి బి ఎల్ ఓ లు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జ్యోతి సాయిబన్న, సీనియర్ నాయకులు వెంకట్ రాములు, చంద్రశేఖర్,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షు డు రామకృష్ణ గౌడ్,మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, నాయకులు విఠల్ రావు ,గోవిం దు, శ్రీనివాసులు,రాము, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

- మైనర్ డ్రైవింగ్‌పై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం
- 9 మైనర్ల వాహనాలు సీజ్.. తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్
- మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు..




**మహబూబ్‌నగర్ బ్యూరో జూలై 28 (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీ (స్పెషల్ డ్రైవ్) నిర్వహించడం జరిగింది.ఈ తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మోటార్‌సైకిళ్లు నడుపుతున్న 9 మంది మైనర్లు గుర్తించబడ్డారు. వారి వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అలాగే మైనర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, మైనర్ వయస్సులో వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర లేదా ఇతర మోటారు వాహనాలు ఇవ్వవద్దని, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగితే, పరిస్థితులను బట్టి సంబంధిత చట్టాల ప్రకారం వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు లేదా సంరక్షకులపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల భద్రతే పోలీసుశాఖ ప్రధాన లక్ష్యమని, మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

### భీముడు నాయక్ కుటుంబానికి

## బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**ఖిల్లా ఘనపురం, 28, జులై (జనంసాక్షి):** మండల పరిధిలో నీ నెలబండ తండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు భీముడు నాయక్ క్యాన్సర్ వ్యాధితో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళ వారం నెలబండ తండా కు చేరుకొని భీముడు నాయక్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం మృతుని కుటుంబని అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.మాజీ మంత్రి వెంట తండా వాసులు చక్రూ నాయక్, రాములు నాయక్ ,బిక్య నాయక్, తదితరులు ఉన్నారు.

## విద్యా హక్కు చట్టంను తుంగలో తొక్కిన ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**గద్వాల నడిగడ్డ, జులై 28(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్,గద్వాల నియోజకవర్గంలో వివిధ మండల, గ్రామాలలో ప్రైవేటు స్కూల్ యజమానులు విద్యా హక్కు చట్టం 2009ని తుంగలో తొక్కారని, వాటిని అమలు చేయడం లేదని వెంటనే అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మికి సామాజికవేత్త జి. ఎన్ .దేవరాజు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జోగులాంబ గద్వాల జిల్లాలో కొన్ని పాఠశాలలకు గోడలకు బదులుగా నాపరతి నల్ల బండలు గోడలుగా ఏర్పాటు చేసి వాటిపై ఐరన్ రేకులతో, పశువుల షెడ్డులుగా నిర్మాణం చేసుకొని అ పాఠశాలలలో విద్యార్థిని ,విద్యార్థులకు సరియైన మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణాలు,విద్యార్థి విద్యార్థులను తీసుకొని పోయే స్కూల్ బస్సులకు సరియైన ఫిట్నెస్ లేకపోవడంతో పాటు ప్రయివేట్ ప్యాసింజర్ ఆటోలను ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, ఒకే తరగతి గదులలో 30 నుండి 40 మంది పిల్లలు ఇరుకు గదులలో ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, ఇదే పాఠశాలలోనూ,ప్రయివేట్ భవనం లలోను,నవోదయ, గురుకుల,రెసిడెన్సీ పాఠశాలలకు ప్రవేశాల కోసం ఎలాంటి వసతులు లేకుండా అక్రమంగా వసతి గృహాలు ఏర్పాటు చేసుకొని కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారని,పాఠశాలలా మాటున అడ,మగ పిల్లల వసతి గృహాలు ఏర్పాటు చేస్తూ నడిపించడం జరుగుతుందనీ, ఈ పాఠశాలలా పై కఠినమైన చర్యలు తీసుకోవాలని, విద్య హక్కు చట్టం 2009 ను అమలు చేయని ప్రవేట్ విద్యాసంస్థల పర్మిషన్ రద్దు చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా డిఇఒ ని సామాజిక వేత్త జి.ఎన్. దేవరాజు కోరారు.

## మక్తల్ విద్యార్థుల ప్రభంజనం

- గ్రేటర్ హైదరాబాద్ అథ్లెటిక్స్ పోటీల్లో 18 పతకాలు



**మక్తల్, జూలై 28 (జనంసాక్షి):** ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మక్తల్ ఈనాడు లక్ష్య సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో మన మక్తల్ క్రీడాకారులు ఏకంగా 9 స్వర్ణ (గోల్డ్), 6 రజత (సిల్వర్), 3 కాంస్య (బ్రౌంజ్) పతకాలతో మొత్తం 18 పతకాలను తమ ఖాతాలో వేసుకున్నట్లు కోచ్ జగదీశ్ మంగళవారం విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించడం వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తుకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2% స్పోర్ట్స్ రిజర్వేషన్ కూడా కల్పిస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని మక్తల్ పట్టణ పరిసర ప్రాంత విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 14వ వార్డులో పర్యటించిన

## మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర



**నాగర్‌కర్నూల్, జూలై 28 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ పట్టణంలోని 14వ వార్డులో పర్యటించి, డ్రైనేజీ మరియు సీసీ రోడ్లు అవసరమున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ నజీమ్ కాజాఖాన్, మున్సిపల్ ఏఈ, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

## హామీల కమిటీ పగ్గాలు సంజీవరెడ్డికి

- అసెంబ్లీ ప్రాంగణంలో ఘనంగా బాధ్యతల స్వీకారం
- మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకుల అభినందనలు
- నారాయణఖేడ్‌కు గర్వకారణమని హర్షం



**నారాయణఖేడ్, జూలై 28 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ హామీల అమలు కమిటీ (Committee on Government Assurances) ఛైర్మన్‌గా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డా. పట్లోళ్ల సంజీవరెడ్డికి రాష్ట్ర స్థాయిలో కీలకమైన ఈ బాధ్యత లభించడం నారాయణఖేడ్ నియోజకవర్గానికి గర్వకారణమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు సకాలంలో, సమర్థవంతంగా అమలయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు. బాధ్యతల స్వీకార కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారు డా. సంజీవరెడ్డికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో లభించిన ఈ కీలక బాధ్యత నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని, వారు తెలిపారు.

## ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ మూల సిద్ధాంతం

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై బిఎల్ఏలతో సమీక్షా సమావేశం
- ఆరు రోజులు బిఎల్ఏలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలి
- రూ.1,890 కోట్లతో మక్తల్ నియోజకవర్గంలో రికార్డు స్థాయి అభివృద్ధి
- మంత్రి వాకిటి శ్రీహరి





**మక్తల్, జూలై 28 (జనంసాక్షి):** దేశంలో ఉన్న ఏ పేదవాడు కూడా ఏ కారణం చేతనైనా ఓటు హక్కును కోల్పోకూడదన్నదే కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమీక్షా సమావేశంలో నియోజకవర్గానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా బిఎల్ఏలు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గతంలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఏకంగా 90 లక్షల ఓట్లు గల్లంతయ్యాయి. అలాంటి పరిస్థితులు ఇక్కడ రాకూడదు. ఓటరు జాబితాను సరిచూసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడటమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలి. ప్రక్రియ ముగియడానికి ఉన్న చివరి 6 రోజులు ప్రతి బిఎల్ఏలు, గ్రామ స్థాయి నాయకులు కష్టపడి పనిచేసి ఇంటింటి పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా తప్పులు లేకుండా, పారదర్శకంగా రూపొందించడంలో బిఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని, అవసరమైన దరఖాస్తులను సకాలంలో అధికారులకు సమర్పించాలని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం తర్వాత రాష్ట్రంలో మక్తల్ నియోజకవర్గమే అభివృద్ధిలో ముందంజలో ఉందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. రోడ్లు, వంతెనలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నియోజకవర్గం అగ్రగామిగా నిలిచిందన్నారు.

మక్తల్ మొదటి ఎమ్మెల్యే శాంతాబాయి కాలం నుండి ఇప్పటివరకు 72 ఏళ్లలో నియోజకవర్గానికి రూ. 398 కోట్లు మాత్రమే రాగా, తాను పదవిలోకి వచ్చిన ఈ రెండున్నర ఏళ్లలోనే ఏకంగా రూ. 1,890 కోట్ల నిధులు తీసుకువచ్చానని వెల్లడించారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలోని 7 మండలాలు, 3 మున్సిపాలిటీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాలకు అక్కలబస్తీ అతలాకుతలం...వరదనీటికి బస్తీ ప్రజల తిప్పలు

- వెంటనే అధికారులు స్పందించి పనులు చేపట్టాలి
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు







**రామాయంపేట జూలై 28 (జనంసాక్షి):** అక్కలబస్తీని వరద ముంపు నుంచి వెంటనే రక్షించాలి – టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జి కారణంగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు

రామాయంపేట పట్టణంలోని 11వ వార్డు అక్కలబస్తీలో గత రెండేళ్లుగా ప్రజలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, వర్షాకాలం వస్తే ప్రతి ఇంటిలోకి వరద నీరు చేరి ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడుతున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మెదక్ జిల్లా నాయకులు రాగి రాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు అక్కలబస్తీలోని దాదాపు అన్ని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ సమస్యపై బస్తీ ప్రజలు అనేకసార్లు మున్సిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

అక్కలబస్తీ నుంచి బయటకు వెళ్లాల్సిన వర్షపు నీటి ప్రవాహాన్ని టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జి అడ్డుకుంటోందని, ఫలితంగా నీరు బయటకు వెళ్లే మార్గం లేక మొత్తం బస్తీ చెరువును తలపించేలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే సాంకేతిక లోపాలను సరిదిద్ది, నీరు నిరంతరంగా బయటకు వెళ్లే విధంగా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రామాయంపేటలో అక్కలబస్తీ అంటేనే అవస్థల బస్తీ అనే పరిస్థితి ఏర్పడిందని, అక్కడి ప్రజల గోడు వినే నాథుడే లేకపోవడం బాధాకరమని రాగి రాములు విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితిలో ప్రజలు జీవిస్తున్నారని, వర్షం కురిస్తే ఇళ్లలో నీరు నిలిచి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని వీడి అక్కలబస్తీ సమస్యను అత్యవసరంగా పరిగణించి, టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జిని సరిచేసి, శాశ్వత డ్రైనేజీ పరిష్కారం అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. అలాగే ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే అక్కలబస్తీ ప్రజలతో కలిసి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని రాగి రాములు హెచ్చరించారు.

## పసుపుల దత్తాత్రేయ ఆలయాభివృద్ధికి శ్రీకారం

- 50 లక్షలతో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, జూలై 28 (జనంసాక్షి):** మక్తల్ మండలం పసుపుల గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన పసుపుల దత్తాత్రేయ స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన సదుపాయాలను దశలవారీగా పెంపొందిస్తామని చెప్పారు. ఆధ్యాత్మిక కేంద్రాల విస్తరణతో పాటు గ్రామీణ ప్రాంతాల సమగ్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ అభివృద్ధి పనుల వల్ల ఆలయ విశిష్టత మరింత పెరుగుతుందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. చేపట్టిన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పసుపుల గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు మరియు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం పల్లెల్లో జోరుగా మద్యం విక్రయాలు

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో యువత పెడదారి పడుతోన్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

**మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు...**

మద్యం విక్రయాలు అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విఫలం, గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయించడంతో సామాన్య ప్రజలు, మద్యం మత్తులో లో గొడవలు పడుతూ పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ.. జైలు పాలవుతున్నారు. మద్యం విక్రయాలను అరికట్టాలని ఆయా గ్రామాల నుండి పిర్యాదులు వచ్చిన ఎక్సైజ్ శాఖ అధికారులు, మాత్రం ప్రతినెల ముడుపులు తీసుకుంటూ చర్యలు తీసుకోవడంలేదంటూ ప్రజలు నుండి పడుతున్నారు. వరిగి ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం విక్రయాలను అరికట్టేందుకు పనిచేస్తున్నట్టు లేదు వారిని ప్రోత్సహిస్తున్నట్టు ఉందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

**నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి..**

గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సరించి అక్రమ మద్యం విక్రయించే విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని గ్రామాలలో మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సిద్దిపేటలో సర్ కార్యక్రమంపై విస్తృత అవగాహన

- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ నిరంతర పోరాటం
- సిద్దిపేట నియోజక ఇంచార్జ్ పూజల హరికృష్ణ



**సిద్దిపేట, జూలై 28(జనంసాక్షి):** ప్రజల మధ్యే ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఉదయం సిద్దిపేట పట్టణంలోని 6, 26, 27, 28 వార్డుల్లో సర్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలిసి సర్ కార్యక్రమం ఉద్దేశ్యం, దాని ప్రాముఖ్యతను వివరించడంతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న పూజల హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనకు కొత్త దిశ లభించిందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. గతపాలనలో ప్రజల సమస్యలు గాలికొదిలేయబడ్డాయని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా పారదర్శకంగా పాలన సాగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్, ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలీముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, మార్క సతీష్, జిల్లా డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, జిల్లా మైనారిటీ చైర్మన్ రషద్, వాహాబ్, కార్యకర్తలు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## మెదక్ కళాశాలకు వెళ్లాలంటే అవస్తే..!



**మెదక్ టౌన్ జూలై 28, (జనంసాక్షి):** మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థినులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలకు వెళ్లే ప్రధాన మార్గం నీటితో నిండిపోవడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరడంతో బోధనకు అంతరాయం కలుగుతోంది. సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

# ప్రజలకు మెరుగైన, పారదర్శక పోలీసు సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

- జిల్లా సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలి
- గస్తీ, పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి
- అక్రమ ఇసుక రవాణా, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- పోలీస్ స్టేషన్ రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించాలి
- వార్షిక తనిఖీలలో భాగంగా మాగనూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ







**మాగనూర్, (జనంసాక్షి):** ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా అంకితభావంతో విధులు నిర్వహించాలని, అక్రమ కార్యక్రమాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం మాగనూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, వాహనాల పరిస్థితి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బంది పరేడ్‌ను తనిఖీ చేసి అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించి కట్టడి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అక్రమ ఇసుక రవాణా, గుట్కా, మద్యం, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలంలో నేరాల నివారణకు గస్తీ, పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రతి బీట్ అధికారి తన పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసి, ఆ విధానం ద్వారా సమాచారాన్ని సేకరిస్తూ నేరాలను ముందుగానే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు నిరంతర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడిని మర్యాదపూర్వకంగా, గౌరవంగా కలుసుకొని వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, పోలీసులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వ్యవహరించాలని సూచించారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి పోలీసు సిబ్బంది పరిశుభ్రమైన యూనిఫాం ధరించి సమయపాలన పాటించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ సమానంగా విధులు కేటాయించేలా అధికారులు పర్యవేక్షించాలని కూడా సూచించారు. ప్రజలకు సేవ చేయడం పోలీసు శాఖ ధర్మమని, ప్రతి రోజు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్ఐ అశోక్ బాబు, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఐటీ కోర్ ఎస్ఐ ఖుమల్లేష్, మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన అడిషనల్ ఎస్పీ..

- సైబర్ నేరాల నివారణకు అవగాహనే ఆయుధం
- నిఘా నేత్రాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి





**వెల్దుర్తి, జూలై 28 (జనంసాక్షి):** ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఐపీఎస్ సూచించారు. మంగళ వారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, వివిధ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఆయా కేసుల దర్యాప్తు పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణ, లాకప్ గదులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ, దర్యాప్తులో కీలక ప్రయోజనం ఉంటుందని, వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు.

# హామీల అమలు కమిటీ ఛైర్మన్‌గా సంజీవరెడ్డి



**నిజాంపేట్, జూలై 28(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ హామీల అమలు కమిటీ ఛైర్మన్‌గా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హైదరాబాద్‌లోని శాసనసభ ప్రాంగణంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు రాధాకృష్ణ సేట్, రఘుపతి రెడ్డి, నరసింహారెడ్డి జాలా శంకర్, సర్పంచ్ పత్తిగారి లక్ష్మి శ్రీకాంత్ మన్నే కృష్ణ, తాటిపల్లి కృష్ణ, సబితా చందర్ నాయక్ తదితరులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# 'ఎల్‌నినో' నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- ఆదర్శ రైతు ఈశ్వర్ రెడ్డికి పురస్కారం
- రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**పెబ్బేరు జూలై 28 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్‌తో పాటు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్‌గా ప్రారంభించి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాఖాపూర్ (వై) గ్రామ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులతో కలిసి వీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అధిక ఆదాయం సాధించాలంటే ఉద్యాన పంటల సాగు లాభదాయకమని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కరవు పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండితేనే సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం సాగునీటి లభ్యతపై రైతులు ఆశలు పెట్టుకోకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. కందులు, మినుములు, వేరుశెనగ వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని, ముఖ్యంగా వనపర్తి వేరుశెనగకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు తీసుకుంటూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు మినుముల విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెబ్బేరుకి చెందిన రైతు జగదీశ్వర్ రెడ్డికి ప్రశంసా పురస్కారాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, గ్రామ సర్పంచి నికిత, తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం ధర్నా



**జహీరాబాద్, జూలై 28 (జనంసాక్షి):** హోతి(కె)–శేఖాపూర్ మీదుగా తాండూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్అండ్‌బీ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్ మాట్లాడుతూ, పూర్తిగా దెబ్బతిన్న రహదారిపై వెంటనే కొత్త రోడ్డు నిర్మించాలని, అప్పటి వరకు గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారిలోని గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు. వారంలోగా సమస్యను పరిష్కరించి అవసరమైన మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ హామీ ఇచ్చారు. హామీ అమలు కాకపోతే ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు రహదారి దిగ్బంధం చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ధర్నాలో ప్రజలు, కార్మికులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి .. లక్ష్యాన్ని చేరాలి

మెదక్ డీఈవో రాజు



**పాపన్నపేట, జూలై 28 (జనంసాక్షి) :** విద్యా ప్రమాణాలు పాటించి విద్యార్థులను ఉన్నత లక్ష్యాలకు చేర్చాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాజు పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్పీ పాఠశాలలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు రెండవ రోజు నిర్వహిస్తున్న (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని,ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య మెరుగుపడాలన్నారు. ఆధునిక బోధన పద్ధతులు పాటించి ప్రభుత్వ పాఠశాలలకు ఉన్నత స్థానం కల్పించాలన్నారు. అనంతరం కేజీబీవీ ను పరిశీలించారు. నీటి సౌకర్యం, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థినిలకు మౌలిక వసతులు కల్పించాలని తగు సూచనలు చేశారు. మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి,ఉన్నత పాఠశాల హెచ్ఎం. మహేశ్వర్,ో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి బాలలక్ష్మి తదితరులు ఉన్నారు.

# బాలిక అదృశ్యం.. కేసు నమోదు

**జహీరాబాద్, జూలై 28 (జనంసాక్షి):** జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి అక్షయ (12) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాలిక తండ్రి తమ్మిశెట్టి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై లవ కుమార్ తెలిపిన ప్రకారం అక్షయ ఇంటి నుంచి నీళ్లు తీసుకువస్తానని బిందె తీసుకుని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే జహీరాబాద్ టౌన్ ఎస్సై 8712656763,సీఐ 8712656731 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని తెలిపారు.

# రిజర్వేషన్ బచావో.. సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం!

**దేశవ్యాప్తంగా "రిజర్వేషన్ హటావో ఆందోళన్ (ఆర్ హెచ్ఏ)" పేరుతో కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం సాగుతోంది. విద్య, ఉద్యోగాల్లో కులానికి బదులుగా ప్రతిభే ఏకైక ప్రమాణం కావాలంటూ ఈ ఉద్యమం వాదిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో లక్షలాది మంది యువతను ఆకర్షిస్తున్న ఈ ప్రచారం, రిజర్వేషన్ల అవసరంపైనా, సామాజిక న్యాయంపైనా దేశవ్యాప్తంగా మరోసారి తీవ్రమైన చర్చకు తెరతీసింది. అయితే శతాబ్దాల సామాజిక అణచివేతను సరిదిద్దేందుకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కేవలం "మెరిట్" అనే ఒకే కోణంలో చూడవచ్చా? సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్న వాస్తవాన్ని విస్మరించి రిజర్వేషన్లను రద్దు చేయాలన్న డిమాండ్ న్యాయబద్ధమేనా? ఇదే నేడు దేశం ముందున్న అత్యంత కీలకమైన ప్రశ్న.**

రిజర్వేషన్లు తొలగిస్తే కుల వివక్ష కూడా తొలగిపోతుందా? లేక వేల ఏళ్లుగా అణచివేతకు గురైన వర్గాలు మరోసారి అదే చీకట్లోకి నెట్టబడతాయా? ఒక దేశ భవిష్యత్తును కొన్ని సెకన్ల రీల్స్, వైరల్ పోస్టులు, హ్యాష్‌ట్యాగ్‌లతో నిర్ణయించగలమా? రాజ్యాంగం ఇచ్చిన సామాజిక హామీని సోషల్ మీడియా ట్రెండ్‌తో కొట్టివేయగలమా? భావోద్వేగాలకు లోనుకాకుండా చరిత్రను, రాజ్యాంగాన్ని, సమాజ వాస్తవాలను ఒకసారి ప్రశాంతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లు దయాదాక్షిణ్యాలు కావు. రాజకీయ ప్రలోభాల ఫలితం కావు. అవి రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయ సాధనం. వేల ఏళ్లుగా విద్యకు దూరం చేసినవారికి విద్యా హక్కు, అధికారానికి దూరం చేసినవారికి ప్రాతినిధ్యం, అవకాశాలకు దూరం చేసినవారికి సమాన ప్రవేశం కల్పించాలనే రాజ్యాంగ సంకల్పం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లను ప్రత్యేక హక్కుగా కాకుండా చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే రాజ్యాంగబద్ధమైన చర్యగా చూశారు. అందుకే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4), 46 వంటి నిబంధనలు సామాజికంగా వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక రక్షణ కల్పించాయి.




"మెరిట్ మాత్రమే ప్రమాణం కావాలి" అనే వాదన వినడానికి ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ మెరిట్‌కు ముందు అవకాశం ఉంటుంది. అవకాశానికి ముందు సమాన వేదిక ఉండాలి. ప్రభావవంతమైన రూపం (సిఫార్సు): ఒక విద్యార్థి లక్షల రూపాయల ఫీజులతో కార్పొరేట్ పాఠశాలలో అత్యాధునిక సౌకర్యాల మధ్య చదువుతుంటే, మరో విద్యార్థి ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమితో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. ఈ ఇద్దరినీ ఒకే గీతతో కొలవడం న్యాయమేనా? ఒక కుటుంబానికి తరతరాలుగా విద్య, ఆస్తి, సామాజిక ఆధిపత్యం ఉంటే, మరో కుటుంబం ఇప్పటికీ రోజువారీ కూలి మీద ఆధారపడి జీవిస్తోంది. ఈ అసమాన పరిస్థితుల్లో కేవలం మార్కులనే సమానత్వానికి ప్రమాణంగా చూపించడం వాస్తవాన్ని విస్మరించడమే.

దేశంలో కుల వివక్ష నిజంగానే అంతరించిపోయిందా? గ్రామాల్లో ఇప్పటికీ కులం పేరుతో వివక్ష, సామాజిక బహిష్కరణ, అంటరానితనం, సామూహిక దాడులు, భూహక్కుల వివాదాలు,కుల పరువు పేరుతో జరిగే హత్యలు పూర్తిగా ఆగిపోయాయా? జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు ఎస్సీ, ఎస్టీలపై నేరాలు ఇంకా ఆందోళనకర స్థాయిలో నమోదవుతున్నాయని చెబుతున్నాయి. సమస్య ఇంకా కొనసాగుతుంటే, పరిష్కారాన్ని ఎందుకు తొలగించాలి? సామాజిక అన్యాయం ఇంకా సజీవంగా ఉన్నప్పుడు, దానిని సరిదిద్దే రాజ్యాంగబద్ధమైన సాధనాన్ని తొలగించడం ఎలా న్యాయబద్ధమవుతుంది?

రిజర్వేషన్లను ఆర్థిక ప్రమాణంతో పోల్చడం కూడా సరైన తర్కం కాదు. పేదరికం ఒక ఆర్థిక సమస్య. దానికి సంక్షేమ పథకాలు, విద్యా రుణాలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయం అవసరం. కానీ రిజర్వేషన్ల ఉద్దేశం పేదరిక నిర్మూలన కాదు; సామాజిక వివక్షను సరిదిద్దడం. ఒక సంపన్న దళితుడు కూడా కులం కారణంగా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఒక పేద అగ్రవర్ణ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా కుల ఆధారిత బహిష్కరణను తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అందుకే ఆర్థిక సంక్షేమం ఒక విధానం అయితే, రిజర్వేషన్ సామాజిక న్యాయ విధానం.

సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి కొత్త వేదిక. కానీ అదే సమయంలో అది అపోహలకు కూడా వేదిక కావచ్చు. లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నంత మాత్రాన ఒక వాదన రాజ్యాంగబద్ధం కాదు. వైరల్ అయినంత మాత్రాన అది చరిత్ర కాదు. ఈ దేశాన్ని నడిపేది ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌లు కాదు; రాజ్యాంగ విలువలు. సమాజాన్ని మార్చేది క్షణిక ఆవేశం కాదు; శాశ్వత న్యాయం.

"కులం పోవాలి... రిజర్వేషన్ పోవాలి" అనే నినాదం వినిపిస్తోంది. కానీ అసలు ప్రశ్న వేరే. ముందు కుల వివక్ష పోయిందా? కులాంతర వివాహాలు నిర్భయంగా జరుగుతున్నాయా? గ్రామాల్లో అందరూ ఒకే శ్మశానం, ఒకే దేవాలయం, ఒకే నీటి వనరులను వివక్ష లేకుండా ఉపయోగిస్తున్నారా? కులం పేరుతో అవమానాలు, దాడులు, బహిష్కరణలు పూర్తిగా ఆగిపోయాయా? ఈ ప్రశ్నలకు ధైర్యంగా "అవును" అని చెప్పగలిగిన రోజే రిజర్వేషన్ల అవసరంపై సహజమైన చర్చ మొదలవుతుంది. కానీ నేటి వాస్తవం ఇంకా భిన్నంగానే ఉంది.

బీసీలు, ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు దేశ జనాభాలో అధిక శాతాన్ని కలిగి ఉన్నప్పటికీ ఉన్నత విద్య, ఉన్నత ఉద్యోగాలు, న్యాయవ్యవస్థ, ప్రైవేట్ రంగం, విధాన నిర్ణయ సంస్థల్లో వారి ప్రాతినిధ్యం ఇంకా జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేదు. "జనాభా వివరాలు లేకుండా సంక్షేమం ఎలా? సామాజిక న్యాయం ఎలా?" అనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది. సమగ్ర కుల గణన, విశ్వసనీయ గణాంకాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే సంక్షేమ విధానాలు రూపుదిద్దుకోవాలి. డేటా లేని న్యాయం సంపూర్ణ న్యాయం కాదు.

రిజర్వేషన్ల అంశం రాజకీయంగా సున్నితమైనదే. అందుకే ఈ అంశంపై ప్రతి వాదనను బాధ్యతతో పరిశీలించాలి. రిజర్వేషన్ వ్యతిరేక ప్రచారాల వెనుక ఎలాంటి సామాజిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయో కూడా పారదర్శకంగా చర్చ జరగాలి. అనేక బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఈ తరహా ప్రచారాలు రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయ వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అలాంటి ఆందోళనలను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

రిజర్వేషన్లను రద్దు చేయడం పరిష్కారం కాదు. వాటి అమలులో లోపాలుంటే వాటిని సరిదిద్దాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి. ఆర్థికంగా వెనుకబడిన ప్రతి కుటుంబానికి ప్రత్యేక సంక్షేమ పథకాలు తీసుకురావాలి. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను విస్తరించాలి. కానీ సామాజిక న్యాయం అనే పునాదిని కూల్చి సమానత్వం అనే భవనం నిర్మించలేం.

రిజర్వేషన్ అనేది ఒక వర్గానికి ఇచ్చిన వరం కాదు. భారత రాజ్యాంగం సమాజానికి ఇచ్చిన న్యాయ హామీ. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న భారతదేశం కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంతో కాదు; సామాజిక ప్రజాస్వామ్యంతోనే సంపూర్ణమవుతుంది. రాజ్యాంగం చెప్పిన సమానత్వం అంటే అందరికీ ఒకే గీత గీయడం కాదు; వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. అందుకే నేడు వినిపించాల్సిన నినాదం "రిజర్వేషన్ హటావో" కాదు... "రిజర్వేషన్ బచావో -- సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం." ఎందుకంటే రిజర్వేషన్లను కాపాడటం అంటే ఒక విధానాన్ని కాపాడటం కాదు; అంబేద్కర్ ఆలోచనను, రాజ్యాంగ స్ఫూర్తిని, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని, భారత ప్రజాస్వామ్యానికి వెన్నెముకైన సామాజిక న్యాయాన్ని కాపాడటమే.



**దుండ్ర కుమారస్వామి**
B-Pharm, MS,LLb
**హైకోర్టు అడ్వొకేట్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు,**
**చైర్మన్ : బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ**
**9959912341**

# ఎన్యూమరేషన్ ఫామ్ రానివారు సంప్రదించండి

## హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వీ.కర్ణన్

## ఓటర్ల వివరాలను తప్పుడుగా ఇచ్చే వారిపై సీరియస్‌గా యాక్షన్

**ఖైరతాబాద్, జూలై 28 (జనంసాక్షి) :** ఎన్యూమరేషన్ ఫామ్ అందని ఓటర్లు తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్వో)ను సంప్రదించాలని, అవసరమైతే 1950 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వీ.కర్ణన్ సూచించారు. హైదరాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. మంగళవారం హైదరాబాదులోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 53.3 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లు డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫామ్‌లు సమర్పించేందుకు గడువు ఉన్నందున, అర్హులైన ప్రతి ఓటరు వీలైనంత త్వరగా ఫామ్‌లను బీఎల్వోలకు అందించాలని కోరారు. ప్రస్తుతం సుమారు 10 శాతం ఓటర్లను ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ కేటగిరీల్లో గుర్తించినట్లు తెలిపారు. పరిశీలన పూర్తయ్యే



నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 3 వరకు జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కూడా కొనసాగుతుందని చెప్పారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 1,200 మందిలోపు ఓటర్లు ఉండేలా పునర్వ్యవస్థీకరణ చేపడతామని వివరించారు. ఆగస్టు 10న ముసాయిదా(డ్రాఫ్ట్) ఓటరు జాబితాను విడుదల చేస్తామని, అనంతరం సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరిస్తామని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని కర్ణన్ స్పష్టం చేశారు. కొంత మంది రెండు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉండగా, హైదరాబాద్‌లో కాకుండా తమ స్వగ్రామాల్లో ఎన్యూమరేషన్ చేయించుకుంటున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

**తప్పుడు సమాచారమిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్లకు సంబంధించి తప్పుడు సమాచారమిస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా చనిపోయిన, బదిలీ అయిన, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను తప్పుడుగా ఇచ్చే వారిపై సీరియస్‌గా యాక్షన్ తీసుకుంటామని వివరించారు. సర్ ఎన్యుమరేషన్ ఫారంలో సర్ 2002 సమాచారాన్ని దానికోసం కేటాయించిన బాక్స్ లో పూరించకుండా పక్కనున్న బాక్స్ లో పూరించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత జాబితాలోకి ఎక్కించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అబ్సెంట్, షిఫ్టెడ్ ,డెత్ ఓటర్ల జాబితాలో 4 లక్షల 79 వేల 405 మంది ఓటర్లున్నారని, ఈ ఓట్లు దాదాపు జాబితా నుంచి వంద శాతం తొలగించే ఛాన్స్ ఉన్నట్లు ఆయన వివరించారు. గత నెల 25వ తేదీన ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మంగళవారానికి 34 రోజులు పూర్తి చేసుకుని, హైదరాబాద్ జిల్లాలో 53.33 శాతం జరిగినట్లు వెల్లడించారు. ఇప్పటికే నూటికి నూరు శాతం ఇంటింటికి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలను అందించామని, ఇప్పటి వరకు అధికారులు తిరిగి స్వీకరించిన డిజిటైజ్ చేసిన ఫారాల శాతం 53.33 శాతం పూర్తయినట్లు ఆయన వివరించారు. గడిచిన 34 రోజులుగా జరుగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా ఎక్కువ శాతం ఫారాల డిజిటైజ్డ్ బహద్దూర్ పురాలో మొదటి స్థానంలో ఉండగా, మలక్ పేట నియోజకవర్గం ఆఖరి స్థానంలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. బహదూర్ పురా నియోజకవర్గంలో ఇప్పటి వరకు 58.74 శాతం ఫారాల డిజిటైజ్డ్ జరగగా, మలక్‌పేటలో 49.70 శాతం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 53.33 శాతం ఫారాల డిజిటైజ్ జరిగినట్లు, మొత్తం 25 లక్షల 26 వేల 14 మంది ఓటర్ల వివరాలు డిజిటైజ్డ్ అయి సర్ ప్రక్రియ పూర్తయినట్లు, ఇంకా 22 లక్షల 10 వేల 655 మంది ఓటర్ల వివరాలను డిజిటైజ్డ్ చేయాల్సి ఉందని కర్ణన్ తెలిపారు. ఇప్పటి వరకు డిజిటైజ్డ్ పూర్తయిన ఓటర్లలో సుమారు 10.71 శాతం అంటే 4 లక్షల 81 వేల 744 మంది ఆన్ లైన్ లోనే సర్ ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు, ఓటు నమోదుకు సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ విలేఖర్ల సమావేశంలో అదనపు కమిషనర్లు బదావత్ సంతోష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.